# THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204098
UNIVERSAL
LIBRARY

# OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T84 S96A Accession No. 43

Author సూర్యనారాయణ శాస్త్రి — [illegible]

Title ఆంధ్ర మహా భారత కథలు

This book should be returned on or before the date last marked below.

# పీఠిక.

శ్లో. వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్,
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్.

శ్రీపరమేశ్వరుండు నిజమాయావిజృంభితమైనయీచరాచరజగంబున లోకానుగ్రహకాంక్షం బూని దుష్టనిగ్రహశిష్టపరిపాలనంబులకై యయ్యాకాలంబుల నవతరించి యొక్కొక్కమహాకార్య మొనరించుచుండు ననుటకు మనము వినుచున్న రామకృష్ణాద్యవతారములే ప్రమాణము. ఆభగవదవతారపూరుషుల పావనచరిత్రములు తాత్కాలికమనోరంజకములై యంతరింపకుండఁగ వానిని శాశ్వతంబుగ జీవింపఁ జేసిన త్రికాలవేత్త లగుమహర్షులు గూడ లోకహితార్థంబుగ నుదయించినభగవదంశసంభూతు లగుమహాపురుషులే యనుట యెంతయు నిక్కము. వారాయుపకారమే యొనరింపక పోయి రేని శ్రీరామాదులయుదంతములు దెలిసికొని యానందించుట గాదు గదా? వారినామము లైన నుచ్చరించుట మనకు సాధ్య మగునా? ఆహా! భగవంతునియవతారములు కృత్యములుఁ గూడ దేనికి వశ్యములై నుతి కెక్కుచుండెనో యట్టికవితామతల్లి వాగ్రూపమైనపరమాత్మకలయే యనుటకంటె దానిమహాశక్తి నేమని పొగడఁ దగును? దీనిని బ్రశంసించు రాజతరంగిణిలోనియీ క్రిందికల్హణవాక్యములయర్థ మిట్లున్నది. 'రమ్యనిర్మాణసమర్థు లగుకవిబ్రహ్మలు గాక గతించినకాలమును దృష్టిగోచరంబు గావింప నింక నెవ్వఁడు సమర్థుఁ డగును? దేనియనుగ్రహము లేక సకలభూతలమేలినచక్రవర్తులు గూడ స్మరణకు రాఁ జాలరో యట్టికవికృత్యమునకు నమస్కరించెదను. ఓయన్నా! సత్కవికృత్యమా! నీదయ లేనికారణంబున సకలైశ్వర్యంబుల ననుభవించినవారేమైనను బెక్కండ్రు రాజులు పుట్టినట్లే లోకమునకుఁ దెలియకుండఁగఁ బోయిరి. నిన్నే మని నుతింతును? నీవు లేనిచో జగ మంతయు నంధప్రాయమే.'

ఈ ప్రసంగమున రామకృష్ణాదులు నిజముగా నవతరించిరా? రామాయణభారతాదికథలు సత్యములగునా? యనువిషయ మాస్తికబుద్ధి గలవారలకుఁ జర్చనీయము గాదు. ఇఁక నేమన 'రామధర్మరాజాదులవలెఁ బ్రవర్తింపఁ దగును గాని రావణదుర్యోధనాదులవలెఁ గా' దనునది మొదలుగాఁ బలువిధముల నీతిభక్తిజ్ఞానవైరాగ్యములను బోధించునమ్మహాకావ్యములలోని విషయమే మనకు గ్రాహ్య మని సంతసింపనగును. అట్టివానిలో వేనిని బఠించునపుడు గాని వినునపుడు గాని తత్తన్నాయకులచరిత్రములు కన్నులకుఁ గట్టినట్లుగా నుండి మనస్సు

నకుఁ దన్మయత్వము గలిగించునో యట్టిమహాగ్రంథములు రచించి లోకంబునకు మహోపకార మొనరించినమహానుభావు లనేకులు గలరు గాని వారిలో నెల్ల వేదములకుఁ దరువాత నూతనకవితాసృష్టి నొనర్చినయాద్యకవిబ్రహ్మ యగువాల్మీకి మహర్షియు దానిం బెంచి పోషించిననారాయణాపరావతారుఁ డగు వ్యాసమహర్షియు లోకంబునకు జ్ఞాననేత్రం బొసంగినభగవత్పాదు లనుటకు వారికిని వారికృతినాయకులకును బదులుగా వారిరామాయణభారతభాగవతము లిక్కాలమునఁగూడ మనదేశంబున నెల్లయెడల నవిచ్ఛిన్నముగా భక్తిశ్రద్ధలతోఁ బూజింపఁబడుచుండుటయే ప్రమాణము. మఱియుఁ దమరచనలయందు సత్యవిశ్వాసమును గలిగించి లోకమును దరింపఁజేయుటకో యనఁ గుశలవపోషణరూపంబున శ్రీరామునితోఁ దనకు సంబంధము గలిగించికొని వాల్మీకి వర్ణించినరామాయణకథయుఁ, దాను గౌరవవంశమంతరింపకుండఁగ నిలిపినట్లే కాక కథతోఁ దన కామూలాగ్రముగా సంబంధము దెల్పికొని వ్యాసుండు వర్ణించినశ్రీకృష్ణవిలాసరూపం బగుభారతకథయు, నే మహత్త్వము లేకయే పెక్కువేలసంవత్సరములనుండి యాసేతుహిమాచలంబును గలభారతీయులహృదయములనే కాక ఖండాంతరవాసులచిత్తములను గూడ రంజింపఁజేయ సమర్థము లగునా? ఈప్రసంగంబున మరల వాల్మీకిరఘువీరులును వ్యాసవాసుదేవులును సమకాలికులా యని సంశయించుటచేఁ గాని చర్చించుటచేఁగాని యిసుమంతయుఁ బ్రయోజనంబు లేదనియు నైహికాముష్మికసుఖప్రదంబు లైన యాకథలను బ్రమాణబుద్ధితోఁ బఠించి వానివలనఁ జెందఁ దగినశ్రేయస్సు నొందుటయే జన్మసాఫల్యమనియుఁ దలంపనగును. అందు:—

## మహాభారతప్రశంస.

ఏయది నారాయణకథ యని విఖ్యాతిఁ జెందెనో దేనిని బంచమవేద మని యార్యులు బ్రశంసించిరో దేనిచే బ్రహ్మజిజ్ఞాసువులు సంసారసాగరముఁ దరించిరో దేనికై శౌనకాదులు దత్తావధాను లై చిత్తశుద్ధిం జెందిరో దేనివలన ధర్మవేత్తలు సకలధర్మసంశయనివృత్తిం బొందిరో దేనికిఁ జతుర్వేదసారము బీజమయ్యెనో దేనియందుఁ జతుర్వర్గంబుల కనర్గళంబు లగుఘంటాపథంబులు గనంబడునో యా మహాభారత మిట్టిది యనుట కీక్రిందిభారతపద్యమే ప్రమాణము.

సీ. "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని, యధ్యాత్మవిదులు వేదాంత మనియు
లాక్షణికులు సర్వలక్షణం బనియును, నైతిహాసికు లితిహాస మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని, కవివృషభులు మహాకావ్య మనియుఁ
బరమపౌరాణికు ల్బహుపురాణసముచ్చయం బని మహిఁ గొనియాడుచుండ

ఆ. వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ, డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై, పరఁగుచుండఁ జేసె భారతంబు."

కృష్ణద్వైపాయనుండు తనతల్లి యగుసత్యవతినియోగంబునను భీష్మునియను
మతిని గౌరవాన్వయము నిలిపి హిమవత్పర్వతప్రాంతమందలి తనయాశ్రమమున
కేగి తపం బొనరించుకొనుచుండి ధృతరాష్ట్రపాండురాజవిదురులు పుట్టి పెరిగి
పెద్దవారై పరమగతిని జెందినపిదప నీభారతంబును రచియించి జనమేజయుఁడు
ప్రార్థింపఁగా నతనికి దీనిని వినిపింపఁ దనశిష్యుఁ డగువైశంపాయనుని నియోగించి
నట్లుగా నతఁడే గ్రంథాది నిట్లు వ్రాసికొనెను.

శ్లో. "మాతు ర్నియోగా ద్ధర్మాత్మా గాంగేయస్య చ ధీమతః,
క్షేత్రే విచిత్రవీర్యస్య కృష్ణద్వైపాయనః పురా.
త్రీ నగ్నీ నివ కౌరవ్యాన్ జనయామాస వీర్యవాన్,
ఉత్పాద్య ధృతరాష్ట్రం చ పాండుం విదుర మేవ చ.
జగామ తపసే ధీమాన్ పున రేవాశ్రమం ప్రతి,
తేషు జాతేషు వృద్ధేషు గతేషు పరమాం గతిమ్.
అబ్రవీ ద్భారతం లోకే మానుషేఽస్మి న్మహాఋషిః,
జనమేజయేన పృష్ట స్సన్ బ్రాహ్మణై శ్చ సహస్రశః,
శశాస శిష్య మాసీనం వైశంపాయన మంతికే."

### మహాభారతాదిశబ్దనిర్వచనము.

వేదవ్యాసుఁడే తనయీ మహాకావ్యమును జయమనియు నితిహాస మనియు
సంహిత యనియు మహాభారతమనియు వ్యవహరించి యుండుటచే వీని కన్నిటికి
నర్థ మొక్కటియే యని యీ క్రిందివిధముగా గ్రహింపఁ దగియున్నది.

" చతుర్ణాం పురుషార్థానా మపి హేతౌ జయో మతః."

ధర్మార్థకామమోక్షములకు సాధన మైనగ్రంథమునందుఁ గూడ జయ
శబ్దము వర్తించుచున్న దనెడికోశమును బట్టి సకలవేదసార మయిన యీగ్రంథ
మునకు జయనామ ముచిత మగుచున్నది.

" ధర్మార్థకామమోక్షాణా ముపదేశసమన్వితమ్,
పూర్వవృత్తకథాయుక్త మితిహాసం ప్రచక్షతే "

చతుర్వర్గములయుపదేశముతోఁ గూడినదై మున్ను జరిగినకథను దెల్పు
నట్టిదాని నితిహాస మందురని యుండుటచేతను 'ఇతిహ పారంపర్యోపదేశ ఆస్తే
ఽస్మి న్నితి' అనఁగా నీలాగున జరిగినది యని క్రమక్రమాగత మైనయుపదేశ

మిందుఁ జెల్లుచున్నది గావున నితిహాస మని చెప్పఁబడుచున్నది యనువ్యుత్పత్తి చేతను సకలార్థసాధక మైనదీని కితిహాసనామ ముచితమగుచున్నది.

"భారతః పంచమో వేదః
కార్ష్ణో వేదః పంచమ శ్చ యం మహాభారతం విదుః,
వేదై శ్చతుర్భి స్సహితాం వ్యాస స్యాద్భుతకర్మణః."

ఇత్యాదివాక్యములచేఁ దెలియ నగు వేదతుల్యత్వము వేదార్థబోధకత్వము ననెడి దీనిలక్షణములే దీనిసంహితానామమును విశదపఱచుచున్నవి.

భారం=వేదశాస్త్రములనుండి సారాంశమును, తనోతి=విస్తరింపఁజేయు నది గావున భారత మనియు, భరతవంశరాజులను గూర్చి చెప్పునది గాన భారత మనియు నింక నిట్లే దీనికిఁ గొన్ని నిర్వచనములు కలవు గాని 'పూర్వమందు దేవతలు త్రాసులో నొక్కప్రక్క నాలుగు వేదములను నింకొకప్రక్క దీనిని బెట్టి తూఁచఁగా గొప్పదియు బరువుగలదియు నగుటచే నిదియే వేదములకంటె నెక్కువ తూఁగెఁ గావున దీనికి మహాభారతమను పేరు గలిగిన' దని వ్యాసుఁడు వ్రాసినవ్యుత్పత్తియే దీనిమహత్త్వమును వెల్లడించుచుఁ జతుర్వర్గసాధనంబు చతుర్వేదసారంబు నగుదీనియెడఁ బైనిచెప్పిననామములకుఁ దనతో నన్వర్థైక్యమును గలిగించుచు నెంతయు నుచితతమం బగుచున్నది. ఇహపరములను గరతలామలకంబు గావించు ననేకము లైనయుపాఖ్యానములచే మనోహరమై కురువంశవిస్తారము గాంధారీధర్మశీలము కుంతీధైర్యము విదురునిప్రజ్ఞ పాండవులసత్యవర్తనము ధార్తరాష్ట్రులదుర్వృత్తము వాసుదేవమాహాత్మ్యము ననెడిప్రధానవిషయంబులు గలిగి శ్రావ్యంబై లేఖ్యంబై లక్షశ్లోకంబులచే విరాజిల్లుచున్న యీపంచమామ్నాయమును సేవించువారలకుఁ గలుగుఫలముల నీక్రిందిపద్యమే తెలుపుచున్నది.

సీ. "ఆయురర్థులకు దీర్ఘాయుఃప్రాప్తియు నర్థార్థులకు విపులార్థములును
ధర్మార్థులకు నిత్యధర్మసంప్రాప్తియు విజయార్థులకు మహావిజయమతియుఁ
బుత్రార్థులకు బహుపుత్రసమృద్ధియు సంపదర్థుల కిష్టసంపదలును
గావించు నెప్పుడు భావించి వినుచుండు వారల కిమ్మహాభారతంబు
ఆ. భక్తియుక్తులైనభాగవతులకు శ్రీ, వల్లభుండు భక్తవత్సలుండు
భవభయంబు లెల్లఁ బాపి యిష్టార్థసంసిద్ధిఁ గరుణతోడఁ జేయుచుండు."

మహాభారతాంధ్రీకరణకర్తలు.

ఏతాదృశలక్షణలక్షితంబు నిరుపమానంబు నగునీకృష్ణద్వైపాయనునిపంచమవేదం బాంధ్రభాషాభూషణంబు నాంధ్రకవితాపోషణంబు నాంధ్రజనమనస్సం

తోషణంబు నగుటకు శ్రీరాజరాజనరేంద్రుఁడు కారణము. ఏకాలంబునం దైన నేదేశంబునం దైన నేభాషయైన రాజులయవలంబనంబున వృద్ధి కెక్కు ననుట సహజము గదా? అట్లే యామహారాజు సంస్కృతభాషను బోషించిన శ్రీహర్ష విక్రమ భోజరాజాదులవలె దేశభాష నుద్ధరింప సమకట్టి యనశ్వరంబు నసదృశంబు దృఢబీజంబు నభీష్టార్థప్రదాయకంబు నగునాంధ్రమహాభారతకల్పపాదపం బంకురింపఁ జేసిన ప్రతిష్ఠకే కాక విద్వత్కవులను బోషించి యాంధ్రభాషావధూటి కనేకప్రబంధరత్నాభరణంబు లొసంగఁ జేసిన శ్రీకృష్ణదేవరాయాదులకు మార్గదర్శకుఁడయ్యె ననెడి యశస్సునకుఁగూడఁ బాత్రుఁడై లోకవిఖ్యాతిఁ గాంచెననుట యెల్లరకును దెల్లమే.

రాజమహేంద్రవరము రాజధానిగా వేగీదేశము నేలినచాళుక్యవంశవర్ధనుండు రాజకులభూషణుం డాశ్రితపోషణుండు నైనరాజరాజనరేంద్రుండు తనయాస్థానములోని విద్వత్కవిశేఖరుఁ డయిన నన్నయభట్టారకుని మహాభారత మాంధ్రీకరింపఁ గోరఁగా నతఁ డక్కార్యంబునకుఁ బూని యారాజనరేంద్రునే కృతిపతిగా నొనరించి యాదిసభాపర్వములు నరణ్యపర్వమున సగముపఱకును దెలిఁగించి యంతటఁ గాలధర్మము నొందె. పిదపఁ గొంతకాలమున కుభయకవిమిత్రుఁ డగుతిక్కనసోమయాజి విరాటపర్వము మొదలుగాఁ బదియేనుపర్వములు దెనిఁగించెను. అంతఁ గొంతకాలమునకుఁ జెదలవాడ యెఱ్ఱనార్యుఁ డారణ్యపర్వములోనిమిగిలినభాగము నాంధ్రీకరించెను. ఇట్లు మహాభారతరూపంబయిన యాంధ్రకవితాసృష్టికి బ్రహ్మయు విష్ణువు శంభువు నాబరఁగి మూర్తిత్రయం బట్లుకవిత్రయప్రసిద్ధి వహించిన యీమహాకవులచరిత్రములను వీరియాంధ్రీకరణపద్ధతులను భారతవిశేషాంశంబులను నిందుఁ గొన్ని సంగ్రహించి తెల్పెదను. ఇమ్మహాత్ములచరిత్రము లిదివఱకే బహువిధముల లోకమున వన్నె కెక్కినను రామచరిత్రమ ట్లెంద ఱెన్నివిధంబుల వర్ణించినను వీనికిఁ జర్వితచర్వణదోషము వాటిల్లదని నాయభిప్రాయము.

### నన్నయభట్టు.

ఏ తపశ్శాలి తనకు మున్ను లోకమునఁ గవిత్వరచన గలదని యూహించుటకే కాక చెప్పుటకు వలను పడకుండుటచే నాంధ్రమున నాద్యకవియై యాంధ్రవాల్మీకి యనం దగునో, యేవైదికోత్తముఁడు వేదశాస్త్రపురాణవిజ్ఞానంబుననే కాక మహాభారతసంహిత నాంధ్రంబున రచియించుటం జేసి యాంధ్రవేదవ్యాసుఁ డనం బరఁగునో, యేబ్రాహ్మణోత్తముఁడు విద్వాంసుఁడు కవియు నగుటయే కాక పెక్కండ్రు విద్వాంసులు మహాకవులును గలరాజసభలో—

"..........................................మదీయ చి
త్తము ననిశంబు భారతకథాశ్రవణప్రవణంబు కావునన్.

క. జననుత ! కృష్ణద్వైపా, యనముని వృషభాభిహిత మహాభారత బ
ద్ధనిరూపితార్థ మేర్పడఁ, దెనుఁగున రచియింపు మధికధీయుక్తిమెయిన్."

అని రాజరాజనరేంద్రునిచేఁ బ్రార్థింపఁబడినవాఁ డగుటంజేసి తత్కాలమందలి యెల్లవిద్వత్కవులకు శిరోభూషణంబై యుండునని యూహింపఁ దగునో, యే వాగనుశాసనుండు లక్ష్యలక్షణరూపంబును సకలజనహృద్యంబును నగుమృదు మధురకవిత్వంబుచే నర్వాచీనకవులకు మార్గదర్శి యైనలాక్షణికమహాకవియై విల సిల్లునో, యట్టికవితల్లజుం డగునన్నయభట్టారకుఁడు వైదికశిరోభూషణం బగుస్మా ర్తుఁడు, ముద్గలగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, శ్రుతిస్మృతిశాస్త్రపురాణవేత్త, కర్మజ్ఞాననిష్ఠుఁడు, అద్వైతమతావలంబి, విశేషప్రతిభాశాలి, తపశ్శాలి యనుట కీక్రిందిపద్యమే యాధారము. ఇది యతఁడే వ్రాసికొనుటచే నాత్మస్తుతి యైన యతిశయోక్తియని కొందఱు తలంపవచ్చును. గాని నిజము పరికించినచో నిందలి విషయ మంతయుఁ జెప్పికొనక తప్పకవచ్చినస్వరూపకథనరూప మగుస్వభా వోక్తియే యని తెలియనగును.

సీ. "తనకులబ్రాహ్మణు ననురక్తు నవిరళ, జపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది, నానాపురాణ విజ్ఞాననిరతు
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర, జాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభి, శోభితు సత్ప్రతిభాభియోగ్యు
ఆ. నిత్యసత్యవచను మత్యమరాధిపా, చార్యు సుజను నన్నపార్యుఁ జూచి
పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయా, భరణుఁ డిట్టు లనియెఁ గరుణతోడ."

అహంకారరహితుఁడు, లౌకికజ్ఞానధురీణుఁడు, యథార్థవాదియు తుఁడు తనగోత్రనామము లైన దెలిపినందులకు సంతసింపవలసినదియే కాని యీ తనితల్లిదండ్రులతాతముత్తాతలనామములు దెలిసినవి కా వని విచారింపఁ బని లేదు. ఇతనికిని భీమనాథర్వణులకును సంబంధించినకథ లసత్యము లనియు నిటీవలివారు కల్పించిన వనియుఁ జెప్పుచు "నెట్లయిన నితఁడు పరోత్కర్షము సహింపనిదుస్స్వ భావముగలవాఁ డయినట్లూహింపవచ్చు" నని కొంద ఱితనిపై నొకయపవాద మును వేయ సాహసించిరి కాని వారిసిద్ధాంతము వారిమాటలచేతనే యనాకర మయినట్లు తెలియుచుండుటచే యుక్తియుక్తము గానిదాని నిందుఁ జర్చింప నక్కఱ లేదు. అయినను బ్రసక్తి గలిగినపు డాకథలను సంగ్రహించి వ్రాయుటమాత్ర మనావశ్యకము గాదు.

నన్నయభట్టారకుఁ డాంధ్రభారతరచన సేయుకాలమున వేములవాడభీమకవి రాఘవపాండవీయమును గవిజనాశ్రయమును రచియించి తెచ్చి రాజరాజనరేంద్రునివలన సత్కారము నందఁ గోరి తదాస్థానకవి యగునన్నయకు ముందుగాఁ దనగ్రంథములఁ జూపె ననియు, నాతనికవిత్వమునకు నన్నయార్యుఁ డసహనపడి మాయోపాయంబున వానినిఁ దగులఁ బెట్టించె ననియు, దానిపై భీమకవి నన్నయ యేకాంతస్థలమున నుండి గ్రంథము వ్రాసికొనుచుండు సమయమున నాతనియింటి కేగి తనసంశయములను దీర్చికొనుట కని నెపము వెట్టి యాతని భార్య నడిగి యాంధ్రశబ్దచింతామణి యనెడినన్నయవ్యాకరణమును దీసికొని 'నన్నపార్యుఁ డిప్పు డేపర్వము వ్రాయుచుండె' నని యామె నడిగి 'అరణ్యపర్వమును వ్రాయుచుండి' రని యామె చెప్ప 'నతనివ్రాఁత యరణ్యముననే యుండుఁగాక' యని శపించి వచ్చి యాయాంధ్రశబ్దచింతామణిని జింపి గోదావరిలోఁ గలిపె ననియు నతనిశాపమువలన నన్నయ మృతినొందె ననియు నొకకథ.

నన్నయ భారతమును దెలిఁగించుకాలమున నథర్వణపండితుఁడు భారతము నామూలాగ్రముగాఁ దెనిఁగించి రాజరాజనరేంద్రునివలన గౌరవమును బొందుటకై రాజమహేంద్రవరమునకు వచ్చి ముందుగా నన్నయ నాశ్రయించి తనభారతమును జదివి వినిపించె ననియు, నది విని యతండు మనస్సున నసహనము సెంది దీని నెట్లయిన నశింపఁజేయ వలయు నని తలంచుచుండె ననియు, నింతలో నొకనాఁడు నన్నయాథర్వణులభార్యలు నీళ్లరేవునఁ గలిసికొనినపుడు వచ్చినమాటల ధోరణిని నథర్వణునిభార్య 'నీభర్తభారతములోని పద్య మేదయినఁ జదువు' మని నన్నయభార్య నడుగఁగా నామె,

"పదిదినంబులు భీష్ముఁ డాహవభారకుండు గురుండు పంచదివసంబులు........."

అనుపద్యమును జదివిన నథర్వణునిభార్య నవ్వి 'యింతచిన్నవిషయంబున కింత పెద్దపద్యము రచించిరా' యని తనభర్తరచించిన,

"పదిదినము లైదుప్రొద్దులఁ బడపడి........."

యనునది జదివె ననియు, నంత నన్నయభార్య సిగ్గువడి యింటి కేగి యీ వృత్తాంతము భర్త కెఱిఁగింపఁగా నతండు మఱింత యసహనపడి యథర్వణుఁ డింట లేనిసమయంబున నాతఁ డున్నయిల్లు తగులఁబెట్టించె ననియు, నంతలో నీదుర్వార్త విని యతఁడు పరుగెత్తి వచ్చి ప్రాణతుల్యమైనభారతము పోయినతరువాత నిఁక నీబ్రదు కేల యని యామంటలోఁ బడి ప్రాణములు విడిచెననియు, దాన వచ్చినమహాపాతకముచే నన్నయార్యుఁడు మతి సెడి గతించె ననియు, మఱియొక

చోట నున్న యథర్వణునిభారతమందలి విరాటపర్వము మాత్రము దగ్ధము గాక నిలిచె ననియు నొకకథ.

ఇందు మొదటికథ కుపబలముగా:—

గీ. "ఆంధ్రశబ్ద చింతామణి వ్యాకరణము, ముందు రచియించి తత్సూత్రములఁ దెలుంగు
బాసచేఁ జెప్పె నన్నయభట్టు తొల్లి, పర్వములు మూఁడు శ్రీమహాభారతమున.

గీ. భారతము దెనిఁగించుచుఁ దా రచించి, నట్టిరాఘవపాండవీయము నణంచె
ఛందము నడంప నీఘక్కి సంగ్రహించె, ననుచు భీమున యెంతయు నడఁచె దాని".

అని యప్పకవి యప్పకవీయమున వ్రాసియుండుటచేతను, రెండవకథ కాధారముగా:—

క. "పదిదివసము లైదుప్రొద్దులఁ, బదపడి రణ్ణాళ్లు నొక్కపవలుఁ రేయుఁ
గదనంబు సేసి మడిసిరి, నదిసుత గురుకర్ణశల్యనాగపురీశుల్".

అనుపద్య మథర్వణభారతములోని దని కూచిమంచితిమ్మకవి తనసర్వలక్షణ సారసంగ్రహమునఁ జెప్పియుండుటచేతను, బై రెండుకథలును సత్యము లైనట్లు కనఁబడి లోకమునకు భ్రాంతి గలిగించినమాట సత్యమే. కాని నన్నయ భారతాంధ్రీకరణ మరణ్యపర్వము:లో సగమువఱకే కనఁబడుచున్నందులకు హేతువులఁ గల్పించుటకును, ఆతనిదనెడి యాంధ్రశబ్దచింతామణి మహత్త్వమును లోకమునఁ బ్రకటించుటకును భీమనాథర్వణులు నన్నయకు మించినలాక్షణికకవు లని ప్రశంసించుటకును దగినట్లుగాఁ గల్పింపఁబడిన యీవిపరీతకథలు విశ్వసనీయములు గావు. ఒక పురుషునందుఁగాని నదియందుఁ గాని గ్రంథమునందుఁ గాని మఱియే యితరపదార్థమునందుఁగాని యేదో యొకలోకాతీత మైనమహత్త్వముగల దని వర్ణించు సందర్భమున నిట్టికథలు కల్పించుట మనపూర్వుల కాచారమే. ఇంత యేల? వాల్మీకి చండాలుఁ డనియుఁ గాళిదా సెఱుకులవాఁ డనియుఁ జిరకాలమునుండి కర్ణాకర్ణిగ వచ్చుచుండు కింవదంతులు వారియెడ నీచత్వముఁ దెల్పుటకుఁ గాక మహిమను దెల్పుటకేయైనను విశ్వసింపఁ దగునా? మఱియుఁ గ్రీస్తుపూర్వము 56 లో నున్న కాళిదాసునకును క్రీస్తుశకము 730 ప్రాంతమునం దున్నభవభూతికిని సమకాలిక సహవాసిత్వములను గల్పించి భవభూతి తనయుత్తరరామచరితమును గాళిదాసునకు వినిపింపఁ జేయ నతఁ డశ్రద్ధగా వినె నని యెఱింగి భవభూతి తననాటకమును దగులఁబెట్టికొనెననియుఁ బిదపఁ గాళిదాసీవార్త విని విచారించి తాను విన్నరీతి నానాటక మంతయు మరలఁ జదువఁగా నుత్తరరామచరితము మరల జన్మించి లోకమున వన్నె కెక్కె ననియు, లోకపరంపరాయత్తమై వచ్చుచున్నకథ యెంత సత్యమో పై నన్నయాదులకథలు నంతసత్యములేయని తలంపవచ్చును. కావునఁ బైకథలం

బట్టి నన్నయకవిత్వ మేకారణంబుననో యరణ్యపర్వముననే సమాప్తిఁ జెందె ననియు నన్నయభట్టీయ మనెడియాంధ్రశబ్దచింతామణి నిరుపమాన మైనలక్షణ మనియు గ్రహింపఁ దగును గాని నన్నయభట్టు పరోత్కర్షము సహింపని దుస్స్వభావము గలవాఁ డని యూహింపరాదు.

నన్నయభట్టుకాలము :—ఈకవికాలనిర్ణయమునకు భారతకృతిపతి యగు రాజరాజనరేంద్రునిఁబట్టియే దృఢమయినయాధారములు గనఁబడుచున్నవి. నన్నయను దనయాస్థానమందలి విద్వత్కవిగా నొనరించికొనిన శ్రీరాజరాజు,

శ్లో. "యో రక్షితుం వసుమతీం శకవత్సరేషు
వేదాంబురాశినిధివర్తిషు సింహగేఽర్కే,
కృష్ణద్వితీయదివసోత్తరభాద్రికాయాం
వారే గురో ర్వణిజలగ్నవరే ఽభిషిక్తః".

అను కోరుమిల్లిశాసనములోని పద్యమును బట్టియు,

శ్లో. "తస్మా ద్విమలాదిత్యా ద్రవికులలక్ష్మ్యాశ్చ కుందవా దేవ్యాః,
నిజగుణవశీకృతాఖిలరాజన్యో రాజరాజవిభు రజని".

శ్లో. "య స్సోమవంశతిలక శ్శకవత్సరేషు
వేదాంబురాశినిధివర్తిషు సింహగేఽర్కే,
కృష్ణద్వితీయ దివసోత్తర భాద్రికాయాం
వారే ర్గురో ర్వణిజలగ్నవరేఽభిషిక్తః".

అను నందంపూడి శాసనములోని శ్లోకములంబట్టియు శాలివాహనశకము 944 సంవత్సరమునఁ బట్టాభిషిక్తుఁ డైనట్లు తెలియుచున్నది. ఇతఁడు రాజమహేంద్రవరము రాజధానిగా వేగీదేశమును 41 సంవత్సరములు రాజ్యముచేసినట్లుగా శాలివాహనశకము 1023 లో రాజరాజనరేంద్రునిమనుమఁ డగువీరచోళరాజు వీరచోళచతుర్వేది మంగళాగ్రహారమును దానము చేయుచు వ్రాయించినశాసనములోని:—

శ్లో. "తత స్తదనుజ స్సప్తవత్సరా న్ప్యాతవత్సలః,
విమలాదిత్యభూపాలః పాలయామాస మేదినీమ్.

శ్లో. తత్తనయో నయశాలీ జయలక్ష్మీధామ రాజరాజనరేంద్రః,
చత్వారింశత మబ్దానేకం చ మహీ మపాలయ న్నిఖిలామ్."

అను శ్లోకములవలనఁ దెలియుచున్నది. పై శాసనములలో నందంపూడిశాసన
మును:—

> శ్లో. "ఆజ్ఞప్తి రస్య కటకాధిరాజః కావ్యానాం
> కర్తా నన్నయభట్టో లేఖకో గండాచార్యః,
> ద్వాత్రింశతమే విజయ రాజ్య
> వర్షే వర్ధమానే కృత మిదం శాసనమ్."

అను శ్లోకమువలన మనకవి యగునన్నయభట్టారకుఁడే వ్రాసినట్లు కనఁబడుటచే
నితఁడు క్రీస్తుశకము 1022 మొదలుగా 1063 వఱకును రాజ్యముచేసిన శ్రీరాజ
రాజనరేంద్రునకు సమకాలికుఁడై నందంపూడిదానశాసనకాలమగు క్రీస్తుశకము
1054 వ సంత్సరమునందు జీవించియున్నట్లు స్పష్టమగుచున్నది.

### ఆంధ్రకవులలో నన్నయభట్టుస్థానము.

ఇతఁడు తనగ్రంథావతారికయందే రాజనరేంద్రునిసభలో వైయాకరణులు
పౌరాణికులు మహాకవులు గలరని వర్ణించుటచే నితనికి సమకాలికులైనకవు లుండి
రనుట యటుండఁగా, నితనికిఁ బూర్వ మాంధ్రకవిత్వమే లేనిచో నొక్కమా
ఱుగా నింతనిర్దుష్టము ధారాళము నగుకవితాశైలి యలవడుట యసంగతము
గావునను, బెక్కుకారణములచేఁ దత్పూర్వకవిత్వము నశించి పోయినంతమాత్ర
మున నితనినే తెలుఁగులో మొదటికవిగా నెన్నుట యుక్తము గాదు గావునను,
నన్నయతరువాతివారిలో నిటీవలివా రాతని నాదికవిగాఁ బ్రశంసించిరి గాని
మొదటివారు స్తుతించి యుండలేదు గావునను, నన్నయభట్టాంధ్రకవులలో
మొదటివాఁడు గాఁ డని కొందఱును, నన్నయకుఁ బూర్వ మేదోయొకవిధముగా
భాషలో వెట్టిమొట్టికవిత్వ ముండు నని యూహింపఁదగినను, నియమరహితమై
హృద్యము గాక యున్నయాపూర్వభాషను ఛందోవ్యాకరణబద్ధమైనసగనస్థితికిఁ
దెచ్చుటచేతనే యితనికి శబ్దశాసనుఁడు (వాగనుశాసనుఁడు) అనుబిరుదము వచ్చి
యుండు ననుట నిక్కమగుటచేతను, బరగుణగ్రహణపారీణుఁ డగునితఁడు కర్ణాట
కవి యగు నారాయణభట్టు తనకు భారతరచనమున సహాయపడె నని వ్రాసికొ
నుచుఁ దనకు మున్ను ప్రశంసింపఁ దగినకవులును గ్రంథములు నాంధ్రములో
నున్నయెడల వారిని గాని వానినిగాని పేర్కొనక యుండఁ డనుట విశ్వాసపాత్ర
మగుటచేతను నిజముగా నన్నయకవిత్వమునకు మార్గమును జూపునంతటి సరసమైన
కవిత్వమాతనికిఁ బూర్వమే యున్నయెడల నతఁడు దానిని బేర్కొనకపోయినను,
నదియెట్లయిన నన్యులచేఁ బోషింపఁబడుచు జీవించుచు వచ్చునే కాని యనిర్ధారిత
ములైనకారణములచే నశించియుండునని యనుమానప్రమాణముచే సాధింపఁ

దగినదుష్థిస్నితికి వచ్చిన దని చెప్పుట యనాకర మగుటచేతను, నన్నయకుఁ దరువాతి వారిలో నగ్రగణ్యుండగుతిక్కనసోమయాజి మొదలగువా రందఱు నన్నయ మొదలగుకవులనే తమగ్రంథములఁ బ్రశంసించిరి గాని యాతనిపూర్వకవి నొక్కని నైన నొక్కఁ డైనఁ బేరొక్కని యుండక పోవుటచేతను, నన్నయభట్టారకుఁడే తెలుఁగులో మొదటికవి యని కొందఱును జెప్పుచుండిరి. ఉభయవాదములకు నేవో కొన్ని యుక్తియుక్తము లైనకారణము లుండక పోవు. కాని యాతనికి మున్నాంధ్రకవిత్వము గల దని యంగీకరించినను బ్రయోజనములేక, లేదని చెప్పినను హాని లేక యున్నయీశుష్కవాదములతో నిసుమంతయుఁ బ్రయోజనము లేదు. ఇది తప్పక నన్నయకుఁ బూర్వుఁడు చెప్పినదే యని యొకపద్యశతకమైనను నిస్సంశయముగ నాంధ్రలోకము సమ్మతి గాంచు నంతవఱకు, నాంధ్రభాషాకల్పలతను దృఢముగ నాటి తరువాతియాంధ్రకవులకు భారతఫలరూపం బగుభిక్ష పెట్టిన మహాత్ముఁడు మహాకవి మహాపండితుఁడు నగునన్నయభట్టారకుఁ డాద్యకవి యని ప్రశంసించుట యాంధ్రలోకమున కర్తవ్యకృత్య మని భావింపఁదగును.

## న న్న య భ ట్టు కృ తు లు.

ఇతఁడు భారతమందలి యాదిసభారణ్యపర్వముల నాంధ్రీకరించుటయే కాక లక్షణసార మనుఛందోగ్రంథమును ఆంధ్రశబ్దచింతామణి యనువ్యాకరణమును ఇంద్రవిజయ మనెడికావ్యమును రచియించినట్లు తెలియుచున్నది. ఇందు:—

ఉ. "ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణసంభృత మై పెనుపొంది యుండు నం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్."

అని యుత్తమవిద్య యైనయాంధ్రకవితకు నాథుఁడు నన్నయభట్టే యనెడి సాభిప్రాయవిశేషణ మగువిద్యాదయితపదముచే నన్నయను నుతించిన తిక్కనసోమయాజియు,

ఉ. "సారకథాసుధారస మజస్రము నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచుఁ జనులు హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారతసంహితన్ మును త్రిపర్వము లెవ్వఁ డొనర్చె నట్టివి
ద్యారమణీయు నంధ్రకవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్."

అని సోమయాజివలెనే యాంధ్రకవిత్వమునకు నన్నయభట్టే మొదటివాఁడని తెల్పుటకో యన నంధ్రకవితాగురువిశేషణంబున నన్నయను స్తుతించిన మారన కవియు,

గీ. "ఆంధ్రశబ్దచింతామణివ్యాకరణము, ముందు రచియించి తత్సూత్రములఁ దెలుంగు
బాసచేఁ జెప్పె నన్నయభట్టు తొల్లి, పర్వములు మూఁడు శ్రీమహాభారతమున."

అని కాకునూరి అప్పకవియు నన్నయభట్టారకుండు భారతమందలి మొదటి మూఁడుపర్వములు దెలిఁగించినట్లు ప్రబల మైనసాక్ష్య మిచ్చుచున్నారు కాని యిప్పటివారిలోఁ గొంద ఱితఁ డారణ్యపర్వములో సగమువఱకే తెలిఁగించి యుండఁగా మూఁడుపర్వము లని పూర్వులు స్థూలదృష్టిచేఁ బరిగణించిరి కాని యది సత్యము గాదనియు, మఱికొంద ఱతఁ డారణ్యపర్వము సాంతముగా నాంధ్రీకరించెను గాని దైవవశమున నిటీవల నందుఁ గొంత నశింపఁగా నెఱ్ఱాప్రెగడ దానినిఁ బూరించెను. లేనిచోఁ దిక్కనయే పూరింపఁడా యనియు, నింకఁ గొంద ఱారణ్యపర్వము విఘ్నకారి యనియు నన్నయకు హానిఁగలిగించిన దనియుఁ దలఁచి తిక్కన దాని విడువఁగాఁ దరువాత నెఱ్ఱాప్రెగడ పూరించెను గాని ససాకల్యముగ నన్నయ యారణ్యము తెలిఁగించి యుండ లే దనియు నేవేవో యుక్తులఁ జెప్పుచున్నారు. ఈయుక్తుల కెల్ల మూల మెఱ్ఱనార్యుఁడు మౌనము వహించుట యే కాని వేఱు గాదు. ఆరణ్యపర్వశేషమును పూరించె నని యతఁడు వ్రాసికొనెనుగాని యింతమాత్రమున నిది మిథ్య మనుటకు వలను పడ కున్నది. ఎట్లయిన నేమి? 'శారదరాత్రు' లన్నపద్యము తరువాత నన్నయకవిత్వము కనఁబడదుకావున నంతవఱకే యితఁడు భారత మాంధ్రీకరించి యుండు నని నిర్వివాదపద్ధతి నవలంబింప నగును.

ఇఁక రెండవది యగు లక్షణసార మాంధ్రశబ్దచింతామణితోఁ బాటు గోదావరిపా లయ్యె నని కొందఱును, అట్టి ఛందస్సే యతఁడు రచియించి యుండ లే దని కొందఱును, దలంచెదరు కాని యేమయిన నేమి యిది యిపు డెందును గానరాదు. లక్షణసారములోని వని యానందరంగరాట్ఛందమునఁ గొన్నిపద్యము లుదాహరింపఁబడియున్నవి.

మూఁడవది యగునాంధ్రశబ్దచింతామణివృత్తాంతము గొంత యిదివఱకుఁ దెల్పియుంటిని. నన్నయ యట్టివ్యాకరణమును రచియించి యుండలే దనియు, బాలసరస్వతియో మఱియొకరో దానిని వ్రాసి ప్రసిద్ధికై యాతనిపేరు పెట్టి రనియుఁ జాలమందియాశయము కాని యితఁడు పై రెండుగ్రంథములను రచియించెనా లేదా యని నిర్ధారణ చేయుటకంటె నీతనితరువాత వెడలిన యెల్లఛందోవ్యాకరణ గ్రంథములకు లక్ష్యలక్షణరూపం బగునీతనిభారతమే గురువయ్యె ననెడివిద్వజ్జన విశ్వాసమే పైగ్రంథములం బోలిన వేయిగ్రంథములను నిర్మింపఁదగిన యితని ఛందోవ్యాకరణపాండిత్యవిశేషమును వేయిముఖములఁ బొగడుచున్న దని సంతసింపనగును.

ఇఁక నాల్గవది యగునింద్రవిజయము నీతఁడు విరచించిన ట్లానందరంగరాట్ఛందము చెప్పుచున్నది గాని యాంధ్రలోకము దుర్దశచే నది కేవలము స్మరణీయమయ్యె.

### తిక్కన సోమయాజి.

భారత మాంధ్రీకరించినవారిలో రెండవవాఁ డగునీయుత్తమకవి యార్వేల నియోగిబ్రాహ్మణుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, గౌతమగోత్రుఁడు, కొమ్మమాంబా భాస్కరార్యులకుఁ బౌత్త్రుఁడు, అన్నమాంబాకొమ్మనామాత్యులకుఁ బుత్త్రుఁడు, కేతన మల్లన సిద్ధన లీతని పెదతండ్రులు.

ఈయంశములకుఁ దిక్కనసోమయాజిభారతపద్యమే కాక యాతఁడు కృతినందినదశకుమారచరిత్రములోనివియు, నతఁడు రచియించిననిర్వచనోత్తరరామాయణములోనిదియు నగునీక్రిందిపద్యములును బ్రమాణము.

ఉ. "ధీనిధి భాస్కరార్యునకు ధీరగుణాన్విత కొమ్మమాంబకున్
మానవకోటిలోపల సమస్తగుణమ్ములవాఁడు పెద్ద నా
వానికి వాఁడు పెద్ద యన వానికి వానికి వాఁడు పెద్ద నా
వానికి వారలందఱకు వాఁ డధికుం డనఁ బుట్టి రాత్మజుల్.

ఆ. సుతచతుష్టయంబు నుతికెక్కె గుణనిధి, కేతనయును బారిజాతనిభుఁడు
మల్లనయును మంత్రిమణి సిద్ధనయు రూప, కుసుమమార్గణుండు కొమ్మనయును.

మ. అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికలనధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్."

ఇతని పూర్వపురుషుల మొదటినివాసగ్రామము కృష్ణామండలములోని వెల్లటూరగుటచే వీరియింటిపేరు వెల్లటూరివా రనియు నితనితండ్రితాతలు గుంటూరికిఁ బ్రభుత్వము చేసియుండుటచే గుంటూరివా రనియు నీతనిసంతతివారు నెల్లూరుమండలములోని పాటూరులో స్థిరపడియుండుటచేఁ బాటూరివా రనియుఁ బలువురు పలుతెఱంగులఁ జెప్పెదరు గాని కేతనదశకుమారచరిత్రములోని యీక్రింది పద్యములఁబట్టి వీరియింటిపేరు కొట్టరువు వారని తెలియవచ్చుచున్నది.

గీ. "సూర్యవంశభూపాలకు సుచిరరాజ్య, వనవసంతుండు బుధలోకవత్సలుండు
గౌతమాన్వయాంభోనిధిశీతకరుఁడు, కులనిధానంబు కొట్టరుకొమ్మశౌరి.

గీ. మనుమసిద్ధిమహేశసమస్తరాజ్య, భారధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువుకొమ్మనామాత్యుకూర్మిసుతుఁడు, దీనజనతానిధానంబు తిక్కశౌరి."

## సోమయాజినివాసము, అతనికాలము.

పూర్వోక్తపద్యమునుబట్టి నెల్లూరు రాజధానిగా నెల్లూరుమండలము నేలిన మనుమసిద్ధిభూపాలునొద్ద నితఁడు మంత్రిగా నున్నట్లు తెలియుటచే నీతనినివాసగ్రామము నెల్లూరని విశదమగుచున్నది. ఈతనికాలమునుగూర్చి కవులచరిత్రయుఁ గవిజీవితమును భిన్నాభిప్రాయములయినట్లు కనఁబడుచున్నది గాని పెక్కుకారణములనుబట్టి కవులచరిత్రము తెలుపుచున్నట్లే యితఁడు క్రీ. 13 వ శతాబ్దము మొదటిభాగములోనివాఁ డయినట్లు విశ్వసింపనగును. ఎట్లనఁగా ?—

సీ. "అవనిపై శాలివాహనశకాబ్దంబులు తొమ్మిదినూఱులతొంబది యగు
వరశుభకృన్నామవత్సరంబునను గార్తికశుక్లపంచమితిథిని దివిజ
గురువాసరంబునఁ గర మొప్ప రోహిణీనక్షత్రమున నాఘునప్రభుండు
మానుగా నేకశిలానగరంబు గట్టించె నెంతేనియు శివి మెఱయ
గీ. నప్పురమె యోరుగల్లని యండ్రు కొండ, అచటిమహిమ గణింప శక్యంబు గాదు
నలువ కైనను వేనోళ్లచిలువ కైనఁ, జెలువముల పోల్కి యగు పల్కుఁ జెలికి నైన."

అను కూచిమంచి జగ్గకవి సోమదేవరాజీయములోని పద్యమునుబట్టి కాకతి ప్రళయరాజు శాలి. 990 అనఁగా క్రీ. 1068 వ సంవత్సరమున నేకశిలానగరమును గట్టించి తనరాజధానిగాఁ జేసికొనినట్లు తెలియుటచేతను, ఇతఁడును నితనితరువాతివారును రాజ్యము చేసినకాలమునుగూర్చి వీరనార్యుని ప్రతాపచరిత్రము కొంచె మెచ్చుతక్కువలు సూపుచున్నను, సర్వప్పసిద్ధేశ్వరచరిత్రమును, జగ్గకవి సోమదేవరాజీయమును గూడ నొక్కరీతిగాఁ గాకతిప్రళయరాజు 72 సంవత్సరములు నతని పుత్త్రుఁ డగురుద్రదేవరాజనునామాంతరముగల మొదటిప్రతాపరుద్రుఁడు 60 సంవత్సరములు నితనిపుత్త్రుఁ డగుగణపతిదేవరాజు 58 సంవత్సరములు రాజ్యము చేసినట్లు చెప్పుచున్నవి. * దీనింబట్టిచూడఁగాఁ బ్రళయరాజు క్రీ. శ. 1139 వఱకును, ప్రతాపరుద్రుఁడు 1199 వఱకును, రాజ్యముచేసినట్లును గణపతిదేవరాజు 1199-1257 వఱకు నేలినట్లును స్పష్టపడుచున్నది. ఈకాలము సరియయిన దే యగు నని యితరశాసనములచేఁ గూడ నంగీకరింపఁ దగియున్నది. గాని ప్రతాపచరిత్రమందుఁ జెప్పఁబడినట్లుగాఁ బ్రతాపరుద్రగణపతిదేవులకు నడుమ మహాదేవరాజు గూడ రాజ్యముచేసినట్లు ప్రమాణాంతరములు గన్పట్టుచుండుటచే బ్రళయరాజు రాజ్య మేకశిలానగరము నిర్మింపఁబడుటకుఁ జాలకాలముమున్నె ప్రారంభింపఁబడి యుండు నని యూహింపఁ దగియున్నది. కాని దీనికి నొక్కవిప్రతిపత్తి గన్పట్టుచున్నది. ఎట్లనఁగా:—

* ప్రతాపచరిత్రమువలెనే యీగ్రంథములును గాలనిర్ణయమున నంతఁగాఁ బ్రమాణములు గాఁ దగ వనియే తలంపవచ్చును. కాని శాసనములవలన స్థిరపడఁదగిన గణపతిదేవునికాలమున కివి సహాయపడుచుండుటచేతను నిందలిచరిత్రాంశములు సత్యము లగుటచేతను నిం దుదాహరింపఁబడెను.

" ...........................................

లీలామాత్రద్రుతధృతసమానీతనానానరేంద్రే

యః ప్రఖ్యాతః పృథుభుజబలో రుద్రదేవస్య సైన్యే.

తస్య ప్రసాదో దాత్తశ్రీ శ్శ్రీమతో రుద్రభూపతేః,

నామః కామాత్మజ స్సర్వగుణధామా కృతీష్టదః.

శాకాబ్దే శైలతారాపతిభవగణితే వత్సరే రాక్షసాఖ్యే,

వైశాఖే శుక్లపక్షే కుసుమశరతిథౌ వాసరే భాస్కరస్య.

లింగాని త్రీణి సోఽయం త్రిపురవిజయిన స్సంప్రతిష్ఠాప్య వృత్తీః,

ప్రాదా త్తత్పూజనార్థం సుకృతవితతయే స్వస్య మాతుః పితుశ్చ."

అను * పిల్లలమఱ్ఱిశాసనమున శాలి. 1117 అనఁగా క్రీ. 1195 లోఁ బ్రతాపరుద్రునివలన రాజ్యలక్ష్మిని బొంది యాతనిసేనయందు నాయకుఁడైన నామిరెడ్డి శివలింగములను బ్రతిష్ఠించి వృత్తు లొసంగె నని నామిరెడ్డియే తెలిపి యుండుటచేఁ బ్రతాపరుద్రుఁడే క్రీ. 1195 వఱకును జీవించియున్నట్లు విశద మగు చుండుటవలన మహాదేవుని రాజ్యకాలమును గణపతిదేవుఁడు 1199 లో రాజ్య మునకు వచ్చె నని చెప్పుటయుఁ బొసఁగ కున్నవి. ఒకవేళ మహాదేవరాజు 1196 మొదలుగా 1199 వఱకు రాజ్యము చేసియుండు నని సరిపుచ్చికొనుటకు గొంద ఱూహించినట్లు చెప్పఁదగి యున్నను నిది మహాదేవరాజు 25 సంవత్సరములు రాజ్యము చేసె ననెడి ప్రతాపచరిత్రమునకు విరుద్ధమగును. మహాదేవరాజు 25 సం. రాజ్యము చేసినతర్వాతనే గణపతిదేవరాజు రాజ్యమునకు వచ్చెనని చెప్పి నచో క్రీ. శ. 1199 మొదలుగా 1297 నడుమ నున్నట్లు తెలియఁబడుచున్న గణపతిదేవుని దానశాసనములకును, పిదప 1255 వఱకు భర్తయనంతరము 38 సంవత్సరములు రాజ్యము చేసినరుద్రమదేవిదానశాసనములకును దరువాత రాజ్య మునకు వచ్చిన రుద్రమదేవీగణపతిదేవులపుత్త్రుఁ డగు ద్వితీయప్రతాపరుద్రుఁడు క్రీ. 1309 మొదలుగా 1323 వఱకును నెడనెడ మహమ్మదీయులతో యుద్ధము చేసి గెలుచుటయు నోడుటయు ఢిల్లీపాదుషాకుఁ గప్పము గట్టుటయు మానుటయుఁ దుదకు ఢిల్లీపాదుషాచేఁ గారాగృహస్థుం డగుటయు, ననెడిచరిత్రాంశములకును విరోధము సంభవించును.

ఇది యిట్లుండఁగా గణపతిదేవరాజు మహాదేవరాజును గూడఁ దీసికొని దేవగిరిపై దాడి వెడల నాయుద్ధంబున మహాదేవుఁడు పడిసె ననియు నంత

* ఈశాసనము నైజామురాజ్యములో నల్లగొండజిల్లా సూర్యపేటతాలూకా పిల్లలమఱ్ఱిగ్రామ ములోని దేవాలయములో నున్న దని వెలుగోటివారివంశచరిత్రము చెప్పుచున్నది.

గణపతి మహాకోపముతో యుద్ధము చేసి దేవగిరిరాజును జంప నాతనివారు శరణాగతులై యతనికూఁతు రగురుద్రమదేవిని గానికగా నొసంగి రనియు నతం డామె నేకశిలానగరంబునకు గొని వచ్చి యామెతోఁ గాపురము సేయుచుండఁగాఁ గొంతకాలమునకు ముమ్మక్క యనుకూఁతురు పుట్టె ననియుఁ బిదప యౌవనవతి యగు తనపుత్త్రిక నొకచాళుక్యరాజపుత్త్రున కిచ్చి పరిణయంబు గావింప నామె కాతని వలన నొకపుత్త్రుం డుదయించె ననియు నక్కుమారుఁడే ద్వితీయప్రతాపరుద్రుఁ డను పేరఁ బిదప నోరుగంటికి రా జయ్యె ననియు వచనసోమదేవరాజీయము చెప్పుచున్నది. దీనింబట్టి మహాదేవరాజు వేఱుగా రాజ్యమే చేయ లేదనియు గణపతిదేవుఁడు రాజుగా నుండఁగానే యతఁడు మృతిఁ జెందె ననియుఁ దెలియుటచే బ్రతాపచరిత్రములోని యితనిరాజ్యకాలనిర్ణయము ప్రామాదిక మని తోఁచుచున్నది. మిగిలిన దంతయు సత్యమై యిది యొక్కటియుఁ బొరపా టగునా యనియు సంశయము గలుగవచ్చును గాని యేవిధముగా నాలోచించినను బూర్వోత్తర శాసనములనుబట్టి ప్రతాపరుద్రగణపతిదేవులనడుమ 25 సంవత్సరముల వ్యవధి గలిగిన యీతనిరాజ్యకాలము గనఁబడదు. ఒకవేళఁ బ్రతాపరుద్రునికాలమందు యువరాజుగాఁ గొంతకాల ముండి పిదప నాతనిపుత్త్రుఁ డగు గణపతిదేవునకు సహాయుఁడై పరిపాలించినట్లు కనఁబడు నాధారములఁబట్టియే ప్రతాపచరిత్రకారుఁ డట్లాతనిరాజ్యకాలమును వేఱుగా నిర్ణయించెనేమో యని సంశయము గలుగుచున్నది.

పూర్వోక్తవిషయమువలన మహాదేవరాజు రాజ్యకాలము వేఱుగా లేదని తెలియుటయే కాక యేకశిలానగర నిర్మాణకాలమే ప్రళయరాజు రాజ్యారంభకాల మనియు ద్వితీయప్రతాపరుద్రుఁడు రుద్రమదేవిగణపతి దేవులకుఁ బుత్త్రుఁడు గాక దౌహిత్త్రుఁ డనియుఁ దేలినది. ఇందులకు సువల్ దొరగారిశాసనముల రెండవ సంపుటము 172వ పుటలో "1 త్రిభువనమల్లుఁడు. 2 ప్రోలరాజు. 3 మొదటి ప్రతాపరుద్రుఁడు. 4 గణపతిదేవుఁడు. 5 ఇతనిభార్య రుద్రమ్మ. 1257 మొదలు 1295 వఱకు రాజ్యము చేసెను. ఈమెకూఁతురు ముమ్మక్క. 6 ఈమెపుత్త్రుఁడు రెండవప్రతాపరుద్రుఁడు."

అని యొకనిదర్శనమును— ప్రతాపరుద్రీయములోని నాటకప్రకరణము నందలి దగు

శ్లో. "స్వీకృతే పుత్త్రభావేన దౌహిత్త్రే ప్రాజ్యమాజ్ఞయా
అస్మిన్నిధేహి ధౌరేయే గుర్వీ ముర్వీధురా మిమామ్."

అనఁగా రుద్రమదేవికి స్వయంభువు స్వప్నమునఁ గనఁబడి నాయాజ్ఞచేఁ బూర్వము నీవు పుత్త్రుఁడుగా స్వీకరించినదౌహిత్త్రునియందు రాజ్యభార ముంచు మనెడి

శ్లోక మింకొకనిదర్శనము నగుచున్నది. ఈపైచర్చవలనఁ గాకతిప్రళయరాజును మొదటిప్రతాపరుద్రుఁడును గలసి క్రీ.1068-1199 వఱకు నేకశిలానగరమున రాజ్యము చేసినట్లును 1199 - 1257 వఱకు గణపతిదేవుఁడు రాజ్య మొనరించినట్లును 1257-1295 వఱకు రుద్రమదేవి యేలినట్లును బిదప నామెదౌహిత్రుఁడగు ద్వితీయ ప్రతాపరుద్రుఁడు ప్రభువైనట్లును దెలిసినది. ఇందుఁ బ్రకృతమునకు సంబంధించిన గణపతిదేవునిరాజ్యకాలమును గూర్చి యీక్రిందిశిలాశాసన మొకటియుఁ బ్రమాణముగా నుదాహరించినఁ జాలు నని తలంచెదను.

రేచర్ల పిల్లలమఱ్ఱి బేతిరెడ్డిభార్యయయిన యెఱ్ఱకసానమ్మ పిల్లలమఱ్ఱి దేవాలయముదగ్గఱ నొక*శిలాశాసనము స్థాపించినది. అందు:—

శ్లో. " ......................................

† తస్మాత్తస్యాం సమజని మహాదేవపాదాబ్జభక్తః
ఖ్యాతో భేత స్తతవితరణప్రీణితప్రాణివర్గః.........
భార్యా సుధీసన్నుతసద్గుణౌఘు శ్రీరెఱ్ఱకాఖ్యా నృవరస్య తస్య;
నిత్యానుకూల్యేన స సంతుతోష ధర్మార్థకామార్థకరేణ యస్యాః.

శ్లో. రాజత్కీర్తే ర్గణపతినృప స్యాఖిలోర్వీశచూడా
రత్నవ్రాతద్యుతితతిసముద్భాసితాంఘ్రిద్వయస్య,
సన్మర్యాదానిరతనిఖిలక్ష్మాజనే వర్తమానే
రమ్యే రాజ్యే విపులసుఖదే ప్రోన్నతస్య ప్రహృష్టైః.

శాకాబ్దే సురవర్త్మ రామశశభృద్విశ్వంభరా సంఖ్యయా
సంయుక్తే విభవాఖ్యవత్సరవరే జ్యేష్ఠే మృడాన్యా స్తిథౌ
శుక్లాయాం శనివాసరే జననుతే శ్రీలింగమూర్తే ర్విభో
స్సేయం హైమవతీపతేః కృతవతీ శ్రేష్ఠప్రతిష్ఠాపనమ్.
గ్రామే పిల్లలమఱ్ఱినామ్ని రుచిరే సుస్థాపితా యాదరా
దస్మై సుస్థిర మెఱ్ఱకేశ్వర ఇతి ఖ్యాతాయ సంప్రాదదాత్,
... ... ... ... ... ... ... ..."

అని వ్రాయఁబడియున్నది. దీనింబట్టి చూడఁగా నీశాసనకాల మగుశాలి. 1130 అనఁగాఁ గ్రీ. శ. 1208 లో గణపతిదేవుఁ డేకశిలానగరమున రాజ్యము చేయుచున్నట్లు స్పష్టపడుచున్నది.

* వెంకటగిరివారివంశచరిత్రములో ననుబంధమున నున్నది.

† కామరెడ్డి కుమారుఁడు బేతిరెడ్డి అతనిభార్య యెఱ్ఱకసానమ్మ పిల్లలమఱ్ఱిగ్రామములోఁ దన పేర, ఎఱ్ఱకేశ్వరునిఁ బ్రతిష్ఠించి యాదేవునకు సుక్షేత్రవృత్తుల నొసంగెను.

నెల్లూరిరాజయిన మనుమసిద్ధిభూపాలుఁడు తనదాయాదులవలన రాజ్యమును గోల్పోయి యుండఁగా నతనిమంత్రియు నాస్థానకవియు నగుతిక్కనసోమయాజి యేకశిలానగరమునకు వచ్చి యావృత్తాంత మీగణపతిదేవునకు విన్నవింప నతఁడు ససైన్యముగా వచ్చి మనుమసిద్ధిశత్రువుల నోడించి యాతనిరాజ్యమున నతని మరల నభిషిక్తునిఁ జేసిన ట్లీక్రిందిగ్రంథభాగములు ప్రమాణ మగుచున్నవి.

"... ... ... ... ... ...
అట్టిమహాత్ముని నాసోమయాజి, నెట్టన నెదు రేగి నేర్పుతో రాజు
తెచ్చి యర్ఘ్యాసనస్థితునిఁ గావించి, ... ... ... ... ... ...
అగుభారతాఖ్యాన మావీరవరులు, తగఁ జేసినట్టి యుద్ధప్రకారములు
వినియు సంతోషించెఁ గనివట్లుచెప్ప, ... ... ... ... ... ...
అంతఁ దిక్కన సోమయాజికి మెచ్చి, వింతవస్త్రంబులు వివిధభూషణము
లత్యంతభక్తితో నప్పు డిచ్చుడును, ... ... ... ... ... ...
అగుసోమయాజి తా నారాజున కనె ... ... ... ... ... ... ...
సూర్యవంశంబున సొబగొందునట్టి, యార్యపూజితచర్యుఁ డామన్మసిద్ధి
రాజు దా నెల్లూరు రమణతో నేల, ... ... ... ... ... ...
అక్కన్న బయ్యన్న లధికబలిష్ఠు, లక్కట సిద్ధిరాయనిఁ బాఱఁదోలి
దక్కినరాజ్యంబు తామె యేలుచును, నొక్కకా సైనను జక్కఁగ నీరు ... ... ... ...
వారల దండించి వారినెల్లూరు, వారి కిప్పింపు మవారణఁ బ్రీతి
ననిన గణపతిరా జట్ల కా కనుచు, ... ... ... ... ... ... ... ...
వెడలి గణపతియు విజయంబునకును, ... ... ... ... ... ... ... ...
... ... ... ..., గుప్పున నెల్లూరు కూడ నేతెంచి
యక్కన్న బయ్యన్న నచట సాధించి, ... ... ... ...
... ... ... ..., చెల్లించి మన్మసిద్ధిరాజునకు
నెల్లూరిపట్టంబు నేర్పుతోఁ గట్టి, సల్లలితాద్భుతి సమదుర్గములను
నఱువదెనిమిదియు నగుపట్టణముల, నరు దొంద సాధించి యామన్మసిద్ధి
రాజున కిచ్చియుఁ దేజంబు దిశల, ... ... ... ..."

అని సిద్ధేశ్వరచరిత్రయందును:—

గీ. "చేయఁ దక్కువ యైనదేవాయతనము, లపుడు పూర్తిగఁ గట్టించి యలరుచున్న
చోట నొకనాఁడు తిక్కనసోమయాజి, వచ్చె నెల్లూరినుండి భూవరునికడకు.
... ... ... ... ... ... ...

గీ. ఇనకులోద్భవుఁ డైనట్టి మనుమసిద్ధి,రాజు నెల్లూరు పాలించుచోఁ జెలంగి
యతనిదాయాదు లతని నుక్కఱఁగఁ బట్టి, యునిచి రాజ్యంబు దమ రేలుచున్నవారు.

క. కావున మీ రిపు డచటికి, వేవేగం దరలి వచ్చి విడకుండఁ గ నా
భూవరుఁ బునరభిషిక్తునిఁ, గావింపఁగ వలయు ననిన గణపతివిభుఁడున్.

... ... ... ... ... ... ...

సీ. గణపతిదేవుఁ డాఘనుననుమతిఁ గాంచి, యతిసత్వరమునఁ బ్రయాణభేరి
వేయించి చతురంగపృతనాసమేతుఁడై, తరలి మున్వేలనాఁటిధరణిపతుల
గెలిచి వారలచేత లలి నప్పనముఁ గొని, వారి నందఱఁ దనవశముచేసి
కొని చని నెల్లూరు గొబ్బునఁ జొచ్చి యక్కనయుఁ బయ్యనయు నన్ ఖలులఁ దఱిమి
ఆ. మనుమసిద్ధిరాజుఁ బునరభిషిక్తుఁ గావించి మించి రెండు వేలు నైదు
నూఱు గ్రామములు *మనోవృత్తి కతనికి, నిచ్చి కడమ దాను బుచ్చికొనియె."

అని సోమదేవరాజీయమును మనుమసిద్ధి తిక్కనసోమయాజి గణపతిదేవులచరిత్రము వర్ణింపఁబడినది.

కాఁబట్టి క్రీ. శ. 1199 - 1257 నడుమ నోరుగంటిరాజ్యమేలిన కాకతీయ గణపతిదేవునకు సమకాలికుఁడైన మనుమసిద్ధియు వారిరువురచే గౌరవింపఁబడిన తిక్కనసోమయాజియుఁ గూడఁ గ్రీ. శ. 13 వ శతాబ్దముపూర్వభాగములోనివారనుట నిశ్చయము. సోమయాజి శాలివాహనశకము 1042 లో జన్మించినట్లును 1120 లో మృతిఁజెందినట్లును కొన్నివ్రాఁతలు గనఁబడుచున్నవిగాని యవి ప్రమాణసిద్ధములును యుక్తియుక్తములును గాకపోవుటచే వాని నిందుఁ జర్చింపఁ బనిలేదు.

### తిక్కనసామర్థ్యము, అతనికృతులు.

తిక్కనసోమయాజి నెల్లూరిమండలమున కధిపతియగు మనుమసిద్ధియాస్థానమునఁ గవిగా నున్నవాఁడయినను మంత్రిగౌరవమును బొందుచు రాజ్యకార్యముల లౌకికప్రజ్ఞఁ జూపుచు వన్నెకెక్కినగొప్పలౌకికుఁడు. ఇందులకు దాయాదులవలన రాజ్యముఁ గోల్పోయినతనతేనిని మరల గణపతిదేవునిమూలముగా రాజ్యాభిషిక్తునిఁ జేయుటయే నిదర్శనము. ఇతఁడు సకలమతసారంబు లెఱింగిన తత్త్వజ్ఞుఁ డనుటకు సోమదేవరాజీయములోని యీక్రిందిపద్యమే ప్రమాణము. తిక్కనసోమయాజి నెల్లూరినుండి తనయాస్థానమునకు వచ్చుట విని కాకతీయగణపతిదేవుఁడు:—

సీ. "వచ్చినయయ్యార్యవర్యు నెదుర్కొని, వినయసంభ్రమభక్తు లినుమడింప
నతిథిపూజ లొనర్చి యతనిచే భారతార్థమును ద్వైతాద్వైతతత్త్వములును
విస్తృతచిదచిద్వివేకలక్షణములుఁ, బ్రకటధర్మాధర్మపద్ధతులును
రాజనీతిప్రకారంబును భారతీవీరులమహిమంబు వినుచునుండి
గీ. యనుమకొండనివాసు లైనట్టిబౌద్ధజనుల రావించి వారిఁ దిక్కనమనీషి
తోడ వాదింపఁ జేసినఁ దొడరి వారిఁ, జులకఁగా సోమయాజులు గెలుచుటయును.
వ. అప్పుడు బౌద్ధదేవాలయంబులు గూలం ద్రోయించి గణపతిదేవరాజు సోమయాజులపటువాక్యశక్తికి మెచ్చి యతని బహుప్రకారంబులఁ బూజించి యెనిమిది గ్రామంబు లొసంగి యతఁడు
వచ్చినకార్యం బడిగిన నాభూవరునకుఁ గవివరుం డిట్లనియె."

---

* సిద్ధేశ్వరచరితము మనుమసిద్ధి కిచ్చినగ్రామములు 68 అని చెప్పుచుండఁగా నిది 2500 గ్రామములని చెప్పుచున్నది.

బౌద్ధులను జయించి తన్మతమునఁ గలవిశ్వాసమును మాన్పి గణపతిదేవు నద్వైతమతమునకుఁ ద్రిప్పె ననుటయే సోమయాజి యద్వైతమతాభిమానమును సకలమతవేత్తృత్వమును వెల్లడించుచున్నది. మఱియు నితఁడు వేదోక్తకర్మములయెడ భక్తిశ్రద్ధలు గలిగి వైదికాచారసంపన్నుఁ డయినవైదికుఁడు. ఈశ్వర భక్తుఁడు. ఇందులకే యితఁ డగ్నిష్టోమము చేసి పంచమవేదము నాంధ్రీకరింపఁ బూని కొనుటయు, మనుమసిద్ధిభూపాలునియాస్థానములో నుండి తనయుత్తరరామాయణము నాతనికిఁ గృతి యిచ్చినవాఁడయ్యు వేదతుల్యమైనభారతము నట్టియకయద్వైతమూర్తి యగుహరిహరనాథున కిచ్చుటయు, దృష్టాంతములు.

ఇంక నీతండు సంస్కృతాంధ్రములయం దసాధారణపాండిత్యము గల మహాకవి. ఒకపాటికవిత్వమును మెచ్చునట్టివాఁడు గాఁడు. ఇందుల కీతనికిఁ దనదశకుమారచరిత్రమును గృతి యిచ్చిన కేతనకవివాక్యమే ప్రమాణము.

గీ. "కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప, నరిది బ్రహ్మకైన నతఁడు మెచ్చఁ
బరఁగ దశకుమారచరితంబు సెప్పిన, ప్రోఢ వేఱె నన్నుఁ బొగడ నేల?"

ఈయుభయకవిమిత్రునిపాండిత్యాతిశయమును గూర్చి వారు వీరును వర్ణించిరని చెప్ప నేల? నన్నయభట్టారకునివలెనే తననిజమైనసామర్థ్యమును దెల్పికొని కవిత్వరచనకుఁ గడంగినయీతనియాత్మవిశ్వాసమె యీక్రిందివిధముగాఁ జెప్పుచున్నది.

ఉ. "కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయు నట్లుగ సాత్యవతేయసంస్మృతిన్
శ్రీవిభవాస్పదం బయినచిత్తముతోడ మహాకవిత్వదీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్."

ఈతనిపద్యరచనశైలి చాలవఱకు యతిప్రాసంబులకుఁ గాని సందర్భోచితపదంబులకుఁ గాని తడవుకొనక వచనరచనశైలివలెనే నడచును. సంస్కృతపదము లధికముగా నుపయోగించినపట్లను దీర్ఘసమాసము లుపయోగించినచోట్లను నీతని పద్యరచనశైలి ధారాళముగానే యుండును గాని మొత్తముమీఁద నన్నపార్యుని పద్యకవిత్వశైలికి వలె నీతనిశైలికి సార్వత్రికముగాఁ బ్రవాహగతి గానరాదు. కాని సందర్భోచితపదసంఘటనంబునందును భావావిష్కరణంబునందును ననన్యసదృశమై నిర్దుష్టమై నూతనమై శ్రోత్రపేయమైనయీతనిప్రౌఢశైలి యీతనికే కాక యీతనితరువాతికవులలో నొక్కని కైన నలవడ లేదని సాహసించి చెప్పవచ్చును. కావునఁ బెక్కుకారణముల నింతవఱకు నాంధ్రకవులలో మొదటిస్థాన మలంకరించి యున్ననన్నయభట్టారకునితోఁ బాటు నీతఁడును నాంధ్రకవిత్వరచనమున

మొదటిస్థాన మలంకరించినవాఁ డని విశ్వసింపవచ్చును. ఇదిగాక నన్నయభట్టారకునకును దిక్కనసోమయాజికిని మధ్యకాల మగురమారమి రెండువందలసంవత్సరములలో వీరిం బోలి భారత మాంధ్రీకరింపఁ బూనుకొనినయింకొకకవి పుట్టియుండకపోవుటయే వీ రిరువురే యాంధ్రభాషలో నగ్రిమకవిత్వస్థాన మలంకరింపఁ దగినవా రని చాటుచున్నది. ఆంధ్రమహాభారతమే భాషయై యుండఁగా భాష యని వేఱ చెప్ప నేల? తత్కర్తలే వీరై యుండఁగా నందు వీరు మొదటివారన సంశయ మేల?

### సోమయాజికృతులు.

ఇక్కవిబ్రహ్మ మహాభారతము విరాటపర్వము మొదలుగాఁ బదియేనుపర్వములును దెలిఁగించుటకు మున్నే నిర్వచనోత్తరరామాయణ మనునొకకృతిని రచియించి:—

క. "ఏ నిన్ను మామ యనియెడు, దీనికిఁ దగ నిమ్ము భారతీకన్యక నా
కీ నర్హుఁడ నగుదు ననినను, భూనాయకుపలుకు చిత్తమున కింపగుడున్."

అనునట్లుగాఁ దన్నుఁ జనవుచే మామ యనిపిలిచెడుపోషకుఁ డైనమనుమసిద్ధిభూపాలున కంకిత మొనర్చెను. ఇదిగాక యీతఁడు విజయసేన మనునింకొకగ్రంథమును నిర్మించినట్లు వదంతి గలదు గాని యది యింతవఱకు నెందును గానరాదు.

### ఎఱ్ఱనార్యుఁడు.

భారత మాంధ్రీకరించినవారిలో మూఁడవవాఁడై కవిత్రయములోనివాఁడని వన్నె కెక్కినయీతఁడు పాకనాటినియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; పోతమాంబాసూరనార్యులకుఁ బుత్త్రుఁడు; భారతమాంధ్రీకరించిననాఁటి యితనినివాసగ్రామము గుడ్లూరు; ఈ పైయంశముల కాతని యీక్రిందిపద్యమే ప్రమాణము.

సీ. "భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు, శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు సూర, నార్యునకును బోతమాంబికకును
నందనుం డిలఁ బాకనాటిలో నీలకం, ఠేశ్వరస్థానమై యెసక మెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు, ధన్యుఁడు ధర్మైకతత్పరాత్ముఁ
గీ. డెఱ్ఱనార్యుండు సకలలోకైకవినుతుఁ, డైననన్నయభట్టమహాకవీంద్రు
సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁ, జెందుటయు సాధుజనహర్షసిద్ధిఁ గోరి."

ఈతనివంశములోనివాఁడును, విప్రనారాయణచరిత్రకర్తయు నగుచెదల్వాడమల్లనకవి యీతనింగూర్చి తనగ్రంథములో నీక్రిందివిధముగాఁ బ్రశంసించె.

గీ. "సుకవిసంస్తుత్యు శంభుదాసుని నుతింప, నేర్తునే యైన నేను వర్ణింతు నతని
చిన్నిమనుమఁడఁ గావునఁ జిలుకవాండ్ర, కొదలుఁబలుకులు ముద్దు సేయుదురు గాదె!

సీ. ప్రతిభతో నారణ్యపర్వశేషము చెప్పెఁ, గవులకుఁ జెవులపండువులు గాఁగ
వల్మీకభవువచోవైఖరి రామాయ,ణంబు నాంధ్రప్రబంధంబుఁ జేసె
నారసింహునిపురాణ మొనర్చె హరి మెచ్చి, నన్ను నెన్నఁడు చూచినాఁడ ననఁగఁ
బ్రౌఢిమై హరివంశభాగముల్ రెండును, రచియించె సభలందుఁ బ్రాజ్ఞు లెన్న
ఆ. దురితహరుఁ బ్రబంధపరమేశ్వరుని జెద,ల్వాడనిలయు నాదువంశకర్త
ధన్యమూర్తి శంభుదాసు నెఱ్ఱాప్రెగ్గ,డను నుతింప బ్రహ్మకును దరంబె."

పై పద్యమును బట్టియు విప్రనారాయణచరిత్రలోని యాశ్వాసాంతముల యందలి-

"ఇది శ్రీశంకరస్వామిసంయమీశ్వరచరణసరోరుహధ్యానానందసౌందర్యధుర్యప్రబంధపరమేశ్వరవంశపవిత్ర......చెదల్వాడమల్లయనామధేయప్రణీతంబైన ... ... ..."

అను గద్యముంబట్టియుఁ జెదలవాడమల్లియకవికి వృద్ధప్రపితామహుఁడును బ్రబంధపరమేశ్వరబిరుదాంకితుఁడు నగుమనయెఱ్ఱాప్రెగడయింటిపేరు చెదలవాఁడ వారని తెలియుచుండఁగాఁ గవులచరిత్రమును గవిజీవితమును గూడ నేర్చూరి వారని చెప్పుటకుఁ గారణ మేమో చర్చింపఁ దగి యున్నది. ఇందులకు ముఖ్యకారణ మప్పటికి మల్లయకవి విప్రనారాయణచరిత్రము గనఁబడకపోవుటయే కాని వేఱుగాదు. అట్లయినచో నెఱ్ఱాప్రెగడ భారతములోఁ దననివాసము గుడ్లూ రని వ్రాసికొనియుండఁగా గ్రామనామమునుబట్టి గుడ్లూరివా రనక యేర్చూరివా రని యేల చెప్పవలసివచ్చినది? ఇందులకు నొకకారణము గలదు. అదేదన?-

సీ. "శ్రీవత్సగోత్రుండు శివభక్తియుక్తుఁ డా,పస్తంబసూత్రుం డపారగుణుఁడు
నేర్చూరిశాసనుం డెఱ్ఱనప్రెగ్గడ,పుత్త్రుండు వీరన పుణ్యమూర్తి
కాత్మజుం డగునాదయామాత్యునకుఁ బోలమాంబకు నందను లమితయశులు
కసువనామాత్యుండు ఘనుఁడు వీరనమంత్రి,సింగధీమణియు నంచితగుణాఢ్యు
గీ. లుద్భవించిరి తేజంబు లూర్జితముగ, సోరిది మూర్తిత్రయం బన శుభ్రకీర్తిఁ
బరఁగి రందులఁ గసువనప్రభువునకును, ముమ్మడమ్మను సాధ్వి యిమ్ములను వెలసె."

అని యాంధ్రభాగవతషష్ఠస్కంధాదిని సింగయామాత్యుఁడు వ్రాసినపద్యములోని శ్రీవత్సగోత్రత్వము, శివభక్తియుక్తవిశేషణంబున నాకర్షింపఁబడిన శంభుదాసత్వము, నెఱ్ఱాప్రెగడ యనునామమును, సరిపడుటంబట్టి యేర్చూరిశాసనుం డనువిశేషణమున నేర్చూరివా రనుట కనువు గలుగుటచే నాయెఱ్ఱాప్రెగడయే

భారతారణ్యశేషము దెలిఁగించినయెఱ్ఱాప్రెగడయని భ్రాంతిపడుటయేకాని వేఱుగాదు. సింగయార్యునివంశకర్త యయినయెఱ్ఱాప్రెగడ గోలకొండదేశములోని నల్లగొండమండలమునందలి యేర్చూరుగ్రామములో నుండినవాఁడు. మల్లయకవివంశకర్త యగునెఱ్ఱాప్రెగడ పాకనాటిసీమయందలి నెల్లూరిమండలములోని కందుకూరుతాలూకాలోనిగుడ్లూరుగ్రామమున నుండినవాఁడు. అతఁడు సుప్రసిద్ధకృతికర్త యయినట్లు కానరాదు. ఈతఁడు లోకప్రసిద్ధుఁ డగుకవి. ఆతనివంశమున వీరన్న, నాదయ్య, కసువన్న, సింగయ్య మొదలగువారు క్రమముగా జనించినట్లు కనఁబడును. ఈతనివంశములోఁ గొందఱతరువాత మల్లన, ఎఱ్ఱన, లింగన మొదలగువారు జన్మించినట్లు కనఁబడును. ఈసందర్భమున నొకవేళ నెవరైనఁ దక్కినయంశంబుల లెక్కగొనక పైనుదాహరింపఁబడినవీరన, నాదయాదులకుఁ దరువాతనే యీమల్లన, యెఱ్ఱనాదు లావంశమునఁ బుట్టియుందురేమో యని హాస్యాస్పదం బగుయుక్తి చెప్పవచ్చును గాని యిది యెఱ్ఱాప్రెగడకాలనిర్ణయమునకే యాటంకము కలిగించును. ఇంతయేల? భారతారణ్యపర్వశేషము తెనిఁగించినవాఁడు చెదల్వాఁడనిలయుఁడు నావంశకర్త' యని విప్రనారాయణచరిత్ర కర్త మొఱ్ఱవెట్టుచుండఁగా నితఁడు భాగవతషష్ఠస్కంధకర్త యగుసింగయార్యునివంశకర్తగాఁ డనియు, నీతని యింటిపేరు చెదల్వాడవారేకాక యేర్చూరివారు గా రనియు, విశ్వసించుటలో సంశయ మేమున్నది? ఇఁక నీతనికాలముం గూర్చి యించుక యరయుదము.

### ఎఱ్ఱాప్రెగడకాలము.

ఇతనికాలము నిర్ణయింప నితనిహరివంశమే యాధార మగుచున్నది. ఈహరివంశము నితఁడు కొండవీటిరాజయినయనవేమభూపాలున కంకిత మొనర్చెను. ఈతనితండ్రి యగుపోలయవేమారెడ్డి, ద్వితీయప్రతాపరుద్రునొద్ద సేనానాయకుఁడుగా నుండి పిదప వినుకొండకు రాజయినట్లు వెలుగోటివారివంశచరిత్రము తెలుపుచున్నది. కావునఁ గ్రీస్తుశకము 1323 లో నున్న ప్రతాపరుద్రునకు సమకాలికుఁడై 1340 వఱకు రాజ్యముచేసినపోలయవేమారెడ్డికిఁ బుత్త్రుఁడయిన యనవేమారెడ్డి 1370 వఱకును రాజ్యముచేసిన ట్లుండుటచే నెఱ్ఱాప్రెగడ పదునాల్గవశతాబ్దము మధ్యభాగములోనివాఁ డయినట్లు స్పష్టపడుచున్నది.

### ఎఱ్ఱనార్యునికృతులు.

ప్రబంధధోరణిని భారతభాగము తెలిఁగించినవాఁడగుటఁ బ్రబంధపరమేశ్వరుఁ డనుబిరుదము గాంచిన యీకవిసత్తముఁడు నరసింహపురాణము హరివంశము రామాయణము నను నాంధ్రగ్రంథములనుగూడ రచియించెను. అందుఁ గడపటి కావ్యము నామమాత్రావశిష్ట మగుట యెంతయు శోచనీయము.

ఈతనికవితాధోరణి యసాధారణమై నన్నయ తిక్కనల కవిత్వమును జాల పటిమఁ బోలి యుండును. ఇతఁడు సంస్కృతాంధ్రములయందుఁ జక్కనిపాండిత్య ముగలవాఁ డని యీతనికవితయే లోకమునకుఁ జాటి చెప్పుచున్నది. తక్కినయంశములు భారతరచనప్రశంసలోఁ దెలియఁగలవు. ఇట్లు కవిత్రయచరిత్రమును స్థాలీపులాకన్యాయంబునఁ దెలిసికొని యిఁకఁ బ్రకృత మగుభారతాంధ్రీకరణపద్ధతిని దెలిసికొనఁ గడంగుదము.

## భారతాంధ్రీకరణపద్ధతి.

తే. "సరససంస్కృతపుష్పగుచ్ఛప్రభూత, మగుతెనుంగను నెత్తావి కఖిలదిశలఁ
దరుణపవమాన మగుకవిత్రయవిశేష,చతురవాచానిరూఢి కంజలి యొనర్తు." (రా. చ.)

అని కవిత్రయకవితం బ్రస్తుతించి వారియాంధ్రీకరణపద్ధతులను గూర్చి యించుక వ్రాయఁ గడంగెదను.

శ్లో. 'ఇదం శతసహస్రాఖ్యం శ్లోకానాం పుణ్యకర్మణామ్,
ఉపాఖ్యానై స్సహ జ్ఞేయం శ్రావ్యం భారత ముత్తమమ్.
చతుర్వింశతిసాహస్రీం చక్రే భారతసంహితామ్,
ఉపాఖ్యానై ర్వినైతావ ద్భారతం ప్రోచ్యతే బుధైః.'

అని వ్యాసమహర్షియే యుపాఖ్యానములతోఁగూడ నీభారతము లక్షశ్లోకపరిమిత మయిన దనియు, నుపాఖ్యానములు గాక యిరువదినాలుగువేలశ్లోకములతోఁ గూడిన దనియు నిరూపించినట్లు కనఁబడుచున్నది. కాని సంస్కృతభారతప్రతులయందే మఱియొకచోట :—

శ్లో. 'ఖిలేషు హరివంశ శ్చ భవిష్యం చ ప్రకీర్తితమ్,
దశశ్లోకసహస్రాణి వింశచ్ఛ్లోకశతాని చ.
ఖిలేషు హరివంశే చ సంఖ్యాతాని మహర్షిణా,
యత స్సర్వం సమాఖ్యాతం భారతే పర్వసంగ్రహః.'
'ఖిలేషు హరివంశ శ్చ భవిష్యం చ ప్రకీర్తితమ్,
అష్టాదశసహస్రాణి శ్లోకానాం చ శతం తథా.
ఖిలేషు హరివంశే చ సంఖ్యాతాని మహర్షిణా,
... ... ... ... ... ... ... ... ...'

ఖిలనామకము లైనభాగములు కొన్ని గల వనియు వానిలో హరివంశమును భవిష్యంబు నుత్తమము లనియు ఖిలములలో హరివంశమునందు (పండ్రెండువేలు) (పదునెనిమిదివేలనూఱు) శ్లోకములు చెప్పఁబడిన వనియు వేఱు వేఱు పాఠములు

గన్పట్టుచున్నవి. ఇం దేది నిశ్చయమో యిపుడు నిశ్చయింప రాదు గాని సంస్కృతభారతశ్లోకసంఖ్యామాత్రము వేఱువేఱు ప్రతులలో వేఱువేఱు విధముగాఁ గనఁబడుచున్నది. ఇప్పటికి 44 సంవత్సరముల క్రిందటఁ జెన్నపురిలో నాంధ్రాక్షరములతో ముద్రితమైన యొకసంస్కృతభారతపుఁబ్రతిలో 84770 అయినట్లును, చాల కాలముక్రిందటఁ దెలుఁగుదేశమున వ్రాయఁబడినదియు నాంధ్రసాహిత్యపరిషత్తునకు లభించినదియు నగునొకతాటాకులసంస్కృతభారతపుఁబ్రతిలో 99057 అయినట్లును, ఆంధ్రభారతమున నన్నయభట్టారకుఁడు నిరూపించినదానింబట్టి 100782 అయినట్లును, శ్రీమహాభారతమునందలి యష్టాదశపర్వశ్లోకసంఖ్య తెలియవచ్చుచున్నది. దీనింబట్టి యింక నితరములైన యాయాకాలములయందలి దేశములయందలి వ్రాఁతప్రతులు ముద్రితపుఁబ్రతులును జూచినచో భారతశ్లోకసంఖ్య వెవ్వేఱుగా నుండు ననియే యూహింపఁదగియుండుటచే నష్టాదశపర్వశ్లోకసంఖ్యను నిర్ణయించెడిశ్లోకములు తొలుత వ్యాసమహర్షి నిర్ణయించినదానికంటె వేఱుపడి యయ్యాకాలంబుల నయ్యాప్రతులలోఁ బ్రక్షిప్తములుగాఁ జేరినట్లు తలంపఁదగియున్నది. ఇది యిట్లుండఁగా.—

'ఏతత్పర్వశతం పూర్ణం వ్యాసే నోక్తం మహాత్మనా'

యని సంస్కృతభారతగ్రంథములలో సర్వత్ర కనఁబడుచున్నట్లే

"అను పర్వశతంబులుగలిగి"

యని తెలుఁగు భారతపుస్తకములయందును గలదు. వానియందు వీనియందును గూడఁ బర్వశ్లోకనిర్ణయమునం దాదిపర్వమాదిగా స్వర్గారోహణపర్వాంతము గలయుపపర్వములతోడి పదునెనిమిది పర్వములకే శ్లోకసంఖ్య విధింపఁబడినట్లు కనఁబడుచున్నది గాని యందు శతపర్వములలోని *ఖిలసంజ్ఞితములైన హరివంశభవిష్యత్పర్వములను జేర్చినట్లు కనఁబడదు. దీనిం బట్టి హరివంశమును భవిష్యత్పర్వమును గాక మిగిలినతొంబదియెనిమిది పర్వములశ్లోకసంఖ్యయే వెనుకఁ జూపినవిధముగా భిన్నభిన్నమై వచ్చుచున్నట్లు నిశ్చయ మగుచున్నది. వ్యాసప్రోక్తములైనపర్వములు నూ అయినమాట సత్యమే యయినను భారతగ్రంథములనుబట్టి పర్వశ్లోకసంఖ్యానిర్ణయసందర్భమున హరివంశభవిష్యత్పర్వములు పరిగణింపఁబడకపోవుటచేతను, వానిని విడిచియే భారతశ్లోకసంఖ్య కొంచె మెచ్చుతక్కువగా లక్షకు సరిపడుచుండుటచేతను భారతమునకు శతసాహస్రికసంహిత యని పేరు వ్యాసప్రోక్తమై జగద్విదితమగుటచేతను, ఖిలసంజ్ఞితపురాణములైన యా రెండు పర్వభాగములు గాకయే మిగిలిన యుపపర్వములతోడి పదునెనిమిది పర్వములందును లక్షశ్లోకము లుండవలసిన ట్లితరసందర్భములనుబట్టియు వ్యాస

* మఱి యొకయపేక్షచే నేది శాఖాంతరమునఁ బఠింపఁబడునో యది ఖిల మని వైదికప్రసిద్ధి. హరివంశము పురాణము. ఖిలసంజ్ఞితము.

xxvi

వచనములఁ బట్టియుఁ గూడ స్పష్టమగుచున్నది. ఇట్లుండఁగా గొన్ని ప్రతులలో లక్షకు మిక్కిలి తక్కువగను నిఁకఁ గొన్ని ప్రతులలో లక్షకు నెక్కువగను నుండుట చూడఁగా నయ్యాకాలంబులఁ గాలవశమువలనఁ గొంతగొంత భాగము పోవుటయో కొన్ని కొన్ని భాగము లధికముగాఁ జేరుటయో కారణములుగా నయ్యాకాలములయందు లెక్కకువచ్చుచున్నశ్లోకములనుబట్టి యప్పటప్పటి బుద్ధిమంతు లెవ్వరో యాయావిధముగాఁ బర్వశ్లోకగణనము చేసి యుందు రని భావింపవలసివచ్చినది. ఇందులకు వెనుక నుదాహరించినప్రతులలో మొదటిదానిలో లక్షశ్లోకములకును సుమారు 15 వేలు లోపించినట్లుండుటయు, రెండవదానిలో దాదాపు వేయిమాత్రమే లోపించిన ట్లుండుటయు, మూఁడవదానిలో ననఁగా నన్నయభట్టారకునినిర్ణయమునందు 782 శ్లోకము లధికముగా నున్నట్లుండుటయు, నిదర్శనము.

పూర్వచర్చంబట్టియు నన్నయనిర్ణయమునుబట్టియు నొకలక్షగ్రంథమునకుఁ దక్కువ కాకుండఁగా నుండవలసిన మహాభారతము తెలుఁగులోనికి వచ్చునప్పటికి దాదాపు 50 వేల గ్రంథములోనికి దిగినది. సామాన్యముగా నొకసంస్కృతవాక్యమును సరిగాఁ దెనిఁగించినచో మూలమునకన్నఁ దెలుఁగులో రెట్టింపువర్ణములు పట్టును. ఇందులకు 'స కావ్యం పఠతి.' "వాఁడు కావ్యమును జదువుచున్నాఁడు" అనునది యుదాహరణము. ఇట్టిస్థితిలో లక్షకు రెండులక్షలుగాదు, లక్ష యేబది వేలు గాదు, తుదకు లక్షయును గాదు, సరిగదా, యాంధ్రభారతమున నేఁబది వేలగ్రంథమయిన నిండఁ గనఁబడదు. ఇదియే కవిత్రయమువారు సంస్కృతమహాభారతమును 'మక్కికి మక్కి' యనునట్లుగా ముక్కకు ముక్క చొప్పున దెలిఁగింపక యథేచ్ఛముగా నాంధ్రీకరించి రని తెలుపుటచే నాంధ్రీకరణమందలి యాటంకము లేమియు వారికవితాధార నణఁచి పెట్ట లే దని విశదమగుచున్నది. వీరు ముప్వురలో నొక రెక్కువ యొకరు తక్కువ కాకుండఁగా ముగ్గురు నొక్కవిధముగా సమానముగానే తమతమభాగములను సంగ్రహించి తెలిఁగించిన ట్లీక్రింది పట్టిక తెలుపుచున్నది.

నన్నయభట్టారకుఁడు పర్వసంగ్రహం మం దిచ్చినపర్వశ్లోక సంఖ్యనుబట్టి యీషద్వైషమ్యముగా సరిచూచినలెక్క.

| కవి. | పర్వభాగములు. | సంస్కృతశ్లోకసంఖ్య. | ఆంధ్రగ్రంథసంఖ్య. |
|---|---|---|---|
| నన్నయ. | ఆది—అరణ్యములోఁ గొంతవఱకు | 21218 | 10080 |
| ఎఱ్ఱన. | అరణ్యశేషము. | 6823 | 3822 |
| తిక్కన | విరాటాదిపర్వము. | 72741 | 33600 |

ఇవ్విధముగాఁ బ్రధానకథ కభ్యంతరము గలిగించుకొన్ని కొన్ని భాగములను జక్కఁగ సంగ్రహించుచు నీకఁ గొన్ని భాగములను మెఱుఁగువెట్టి పెంచుచు మొత్తముమీఁద భారతకథయే ప్రధానముగాఁ జేసికొని విద్వజ్జనరంజకం బగు ప్రౌఢశైలిని భారత మాంధ్రీకరించినవీరికవిత్వములోని విశేషాంశములఁ గ్రమముగా నరయఁ దగియున్నది.

## నన్నయభట్టుకవిత్వము.

'లోకో భిన్నరుచి' యనునట్లు కొందఱకవిత్వమును గొందఱును మఱికొందఱకవిత్వమును మఱికొందఱును బ్రేమింతురుగాని మొత్తముమీఁదఁ బరికింపఁగాఁ గవిత్రయమువారి కవిత్వము నాదరింపనివాఁడు లోకములో నొక్కఁడు నుండఁ డని నాయభిప్రాయము. అందు నన్నయకవిత్వము మృదుమధురమై హృదయంగమమై కర్ణరసాయనమై చదువునప్పు డొకవిధ మయినయుత్సాహము గలిగించుచు సంగీతసాహిత్యముల యేకీభావమునలె నాపాతమధురము నాలోచనామృతమునై ద్రాక్షాపాకమున విలసిల్లు.

ఈతనికవిత్వమునందు రెండువంతులు సంస్కృతపదములు నొకవంతు తెలుఁగుపదములు నుండుననుట సత్యమే కాని యాయాపదములసంఘటనము కటువుగాక క్లిష్టముగాక సరళమై మార్దవబహుళమై భావరంజకంబు పదరమ్యంబు నగుచుఁ బండితపామరు లిద్దఱుఁ గూడ సంతోషించునట్లుగా నుండు ననుట కాతని యీక్రిందిపద్యమే ద్యోతకము.

ఉ. "సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకవితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారతసంహితారచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్."

ఇతఁ డూరక యిట్లు చెప్పికొనినవాఁడు కాక చెప్పిన ట్లెల్లఁ జేసినవాఁడే యనుటకుఁ బలువురు పలుతెఱంగులఁ బ్రశంసించికొనెడి పద్యములనే యీక్రింద నుదాహరించెదను.

ఉ. "నిండుమనంబు నవ్యనవనీతసమానము పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు నిక్క మీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుఁ డోఁపు నో
పం డతిశాంతుఁ డయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మఱింపఁగన్. (ఆ. 1. 101.)

మ. మదమాతంగతురంగకాంచనలసన్మాణిక్యగాణిక్యసం
పద లోలిం గొని వచ్చి యిచ్చి ముద మొప్పం గాంచి సేవించి ర

భ్యుదయాస్తాచలసేతుశీతనగమధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణప్రతాపోదయున్. (స. 1. 19.)

చ. నలదమయంతు లిద్దఱు మనఃప్రభవానలబాధ్యమాను లై
సలిపిరి దీర్ఘవాసరనిశల్ విలసన్నవచంపకంబులన్
నలినదళంబులన్ మృదుమృణాళములన్ ఘనసారపాంసులన్
దలిరులశయ్యలన్ సలిలధారలఁ జందనచారుచర్చలన్.

నన్నయభాషాంతరీకరణ మొక్కచో మూలానుసరణ మై మఱియొక్కచోఁ దద్భావానుసరణమై యింకొక్కచో విషయప్రధానమై వేఱొక్కచో రసోచితసంక్షేపవిక్షేపప్రధానమై ప్రధానకథను మాత్ర మతిక్రమింపక మూలమందలి పౌనరుక్త్యాదిదోషంబుల కిరవుగాక సందర్భోచితమై జనరంజక మయినపద్ధతి నవలంబించియుండును. (ఈపద్ధతినే చాలవఱకుఁ దిక్కన యెఱ్ఱనలు గూడ నవలంబించి రని ముందు దెలియఁ గలదు.) ఇందులకు స్థాలీపులాకన్యాయంబుగ నీక్రిందిపద్యము లుదాహరణము గాఁగలవు.

మూలానుసరణము— (శకుంతలోపాఖ్యానమున)

శ్లో. "మన్యతే పాపకం కృత్వా న కశ్చి ద్వేత్తి మా మితి,
విదంతి చైనం దేవా శ్చ య శ్చైవాంతరపూరుషః.
ఆదిత్యచంద్రా వనిలానలౌ చ ద్యౌ ర్భూమి రాపో హృదయం యమ శ్చ;
అహ శ్చ రాత్రి శ్చ ఉభే చ సంధ్యే ధర్మ శ్చ జానాతి నరస్య వృత్తమ్."

చ. "విమలయశోనిధీ! పురుషవృత్త మెఱుంగుచు నుందు రావె వే
దములు ను బంచభూతములు దిక్కులు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా
ర్థము లివి యుండఁగా నరుఁడు దక్కఁగ నేర్చునె తన్ను ముచ్చిలన్."

ఇందు సంబోధనపదము సందర్భమునుబట్టి వచ్చినది. మూలమునందుఁ బంచభూతములనామములు వేఱువేఱుగా నుండఁగా నిందుఁ దత్సమూహబోధక మగుపంచభూతపద ముపయోగింపఁబడినది. మిగిలిన రెండవశ్లోకమందలిపదము లన్నియు సరిగా నిందుఁ గనఁబడుచున్నవి. మఱియు నాలవపాదమున మొదటిశ్లోకముతాత్పర్యము గూడ నిముడ్చఁబడినది. వేదములుగూడఁ బైపదార్థములతోఁ దుల్యము లనునభిప్రాయముతో నొక్క వేదపదముమాత్ర మిం దధికముగాఁ జేర్పఁబడినది. ఇది ముక్కాలుమువ్వీసము మూలము ననుసరించియే యున్న దనుట యటుండఁగా సామాన్యముగా నెంతచక్కనిభాషాంతరీకరణ మైనను సంస్కృతశ్లోకము చదువునప్పు డుండుహాయి దానినిఁ జదువునప్పుడు గలుగ దనెడిలోకాభిప్రాయమును దల్లక్రిందు గావించి భాషాంతరీకరణ మనఁగా మూలమునకుఁ గూడ వన్నె దెచ్చుచు నిట్లుకదా యుండవలయు నని బోధించుచున్నది.

మఱియును:—

శ్లో. "వరం కూపశతా ద్వాపీ వరం వాపీశతా త్క్రతుః,
వరం క్రతుశతా త్పుత్ర స్సత్యం పుత్రశతా ద్వరమ్. 1
అశ్వమేధసహస్రం చ సత్యం చ తులయా ధృతమ్,
అశ్వమేధసహస్రా ద్ధి సత్య మేవ విశిష్యతే. 2
సర్వవేదాధిగమనం సర్వతీర్థావగాహనమ్,
సత్యం చ వచనం రాజన్! సమం వా స్యా న్న వా సమమ్." 3

చ. "నుతజలపూరితంబు లగునూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొకబావి మేలు మఱి బావులు నూఱిటికంటె నొక్కస
త్క్రతు వది మేలు తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు త
త్సుతశతకంబుకంటె నొకసూనృతవాక్యము మేలు చూడఁగన్.

కం. వెలయంగ నశ్వమేధం,బులు వేయును నొక్కసత్యమును నిరుగడలం
దుల నిడి తూపఁగ సత్యము, వలనను ములు సూపు గౌరవంబున పేర్మిన్.

గీ. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద, సమధిగమము సత్యంబుతో సరియుఁ గావు
ఎఱుఁగు మెల్లధర్మములకు నెందుఁ బెద్ద, యండ్రు సత్యంబు ధర్మజ్ఞు లైనమునులు."

పైమూఁడు శ్లోకములకును గ్రమముగాఁ గ్రింది మూఁడుపద్యములును రచింపఁబడినవి. ఇది సరియయినయాంధ్రీకరణ మనఁదగును.

భావానుసరణము.- (శంతనూపాఖ్యానమున)

శ్లో. "సర్వతో భవతః క్షేమం విధేయా స్సర్వపార్థివాః,
తత్కిమర్థ మిహాభీక్ష్ణం పరిశోచసి దుఃఖితః."

చ. "భవదభిరక్షితక్షితికి బాధ యొనర్పఁగ నోపునట్టి శా
త్రవనివహంబు లేదు వసుధాప్రజ కెల్ల ననంతసంతతో
త్సవముల రాజు లెల్ల ననిశంబు విధేయుల నీకు నిట్లు మా
నవవృషభేంద్ర! యేమొకో? మనఃపరితాపముఁ బొందియుండఁగన్?"

'సర్వతో భవతః క్షేమం' అను వాక్యమునందు "రాజే రాష్ట్రము రాష్ట్రమే రా జనియెడి యభేదాధ్యవసాయముచే నీపుడమికి బాధ గలిగించునట్టి శత్రువులు లేరు గావున నీప్రజలు సుఖముగా నుండిరి. అదియే నీక్షేమ" మనెడి భావము స్ఫురించుచుండుటంజేసి పైపద్యము నందలి మొదటిరెండువాక్యములును రచియింపఁబడినవి. మిగిలినది మూలానుసరణముగనే యున్నది. ఈభావానుసరణ మెంత యుచితముగా నున్నదో విద్వల్లోకమే తెలియఁగలదు.

విషయప్రాధాన్యము:— (దుష్యంతునిఁగూర్చి శకుంతలవాక్యము)

శ్లో. "న వాససాం న రామాణాం నాపాం స్పర్శ స్తథావిధః,
శిశో రాలింగ్యమానస్య స్పర్శ స్సూనో ర్యథా సుఖః."

మ. "విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీపుత్రగా
త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహారకర్పూరసాం
ద్రపరాగప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం బుత్రగా
త్రపరిష్వంగము నట్లు జీవులకు హృద్యంబే కడుం శీతమే?"

సద్వస్త్రధారణ శీతలజలస్నాన కాంతాలింగన జన్యమైనసుఖమైనను బుత్రాలింగనసౌఖ్యమును బోల దనెడి తాత్పర్యమును దెల్పుపై శ్లోకమునకును, తారహార కర్పూరచందనచంద్రికలు పుత్రపరిష్వంగమువలె శీతలములును హృద్యంబులును గా వనెడియర్థమును దెల్పుపై పద్యమునకును బుత్రాలింగన మనెడివిషయము మాత్రమే సంబంధముఁ గలిగించుచున్నది. కావున నిది విషయప్రధాన మగుచున్నది. పుత్రాలింగనమందు శైత్యసౌఖ్యము గల దని వ్యాసునియభిప్రాయమును లోకానుభవమును గూడ నెఱింగి నన్నయ పైపద్యమునందు మూలమునకంటె భిన్నముగా నన్నియు శీతలపదార్థంబులు గల్పించెను గాని వేఱువేఱుపదార్థముల వలనఁ గలుగు వేఱువేఱుసుఖము లేవి యైనను సుతపరిష్వంగసుఖమును బోలవనెడి మూలమే యుచితతరముగ నున్నట్లు గన్పట్టుచున్నది. ఇందును వెన్నెలలోఁ బరుండుటవలనఁ గలుగుసుఖముకంటె, మంచిగంధము పూసికొనుటవలనఁ గలుగు సుఖము వేఱని యూహింపవచ్చును గాని కాంతాజలవస్త్రంబులకుఁ గలభేదము కర్పూరచందన చంద్రికలకుఁ గలుగఁబోదు. ఇవన్నియు శైత్యధర్మముచే నొకజాతిలోనివే యగును. అయినను బై మూలభాషాంతరీకరణములయందలి యౌచిత్యమును రసజ్ఞు లూహించెదరు గాక.

సంక్షేపవిక్షేపములు:—(ద్యూతపర్వము. ద్రౌపదీపరాజయము).

సంస్కృతభారతములో నాంధ్రభారతమును సరిచూచుచుఁ జదివినచో నెక్కడఁబట్టిన నక్కడే యధికముగా సంగ్రహించుటయుఁ గొంచెముగాఁ బెంచుటయుఁ గానవచ్చును.

దుశ్శాసనుఁడు ద్రౌపదిని సమీపించి "నిన్ను నీభర్తలోడిపోయిరి గావున నీవు దుర్యోధనునిఁ జూడుము కౌరవులను బొందు" మని చెప్ప నామె భయపడి లేచి పరుగెత్తిపోవుచుండఁగా నతఁ డామెకొప్పు పట్టికొని యీడ్చికొని వచ్చుట,

సభను సమీపించుతఱిని "నే నేకవస్త్రను, రజస్వలను, సభకు రాఁ దగ" నని చెప్పుచు నామె యింద్రకృష్ణార్జునులం బేర్కొని మొఱ్ఱవెట్టుట,

"నీ వేకవస్త్ర వైన నేమి? విగతవస్త్ర వైన నేమి? రజస్వల వైన నేమి? నీవు జూదమున జయింపఁబడితివి. మాకు దాసివైతి" వని యామెను దుశ్శాసనుఁడు సభలోని కీడ్చి తెచ్చుట,

అపు డామె మెల్లఁగా లజ్జతోఁ గొన్నికొన్నిమాటలు పలుకుట మొదలుగా ద్రౌపదీవస్త్రాపహరణము, ద్రౌపదికి ధృతరాష్ట్రుఁడు వరము లిచ్చుట,

యనునంతవఱకును గలమూలకథాభాగమును దెలిఁగించునపుడు నన్నయ కొన్ని కొన్నిమాటలు ముందువెనుకలు గా మార్చుచుఁ గొన్నిటికి మాఱుగా మఱి కొన్నిమాటలు సేర్చుచుఁ గొన్నివచనములు సంగ్రహించుచు మఱికొన్నివచనము లధికముగాఁ జేర్చుచు యథేచ్ఛముగా సందర్భోచితముగాఁ దెలిఁగించెను. అందలివి కొన్నిమూలమునందు గొప్ప వట్టుట మొదలుగా 'నేను రజస్వలను సభకు రాఁ దగ' నను నంతవఱకుఁగలభాగము సంగ్రహింపఁబడి,

"అనుచు (దుశ్శాసనుఁడు) డాయ వచ్చిన నక్కోమలి రజస్వల నన్ను ముట్టకు మేకవస్త్ర యయియున్నదాన గురుబంధుజనాధిష్ఠితం బైనసభ కెట్లు రానేర్తు?" నని సవరింపఁబడినది.

శ్లో. 'యే రాజసూయావభృథే జలేన మహాక్రతౌ మంత్రపూతేన సిక్తాః;
తే పాండవానో పరిభూయ వీర్యం బలా త్ప్రిమృష్టా ధృతరాష్ట్రజేన.'

అను నీశ్లోక మిట్లు మార్పు సెందినది.

ఉ. "ఆనవజాసనం గురుకులాపకరుండు గడంగి రాజసూ
యావభృథంబునందు వసుధామరమంత్రపవిత్రవారిధా
రావళిఁ జేసి పావనము లైనశిరోజములం దెమల్చి పా
పానహుఁ డీడ్చి తెచ్చె సభ కందఱు సంభ్రమ మంది చూడఁగన్."

ఈపద్యము తరువాతిపద్యములలోఁగూడ మూల మందందు మార్పు సెందుచు సంగ్రహింపఁబడినది. మూలమునంగలి యీక్రిందికర్ణవాక్యములు;—

శ్లో. 'దాసస్య పత్నీ త్వధనస్య భద్రే హీనేశ్వరే దాసధనం చ సర్వమ్,
ప్రవిశ్య రాజ్ఞః పరివారం భజస్వ త త్తే కార్యం శిష్ట మాదిశ్య తేఽత్ర.
ఈశా స్తు సర్వే తవ రాజపుత్రి! భవంతి వై ధార్తరాష్ట్రా న పార్థాః,
అన్యం వృణీష్వ పతి మాశు భామిని! యస్మా ద్దాస్యం న లభసి దేవనేన.
... ... ... ... ... ... ... ... ... ... ... ... ...'

తే. "తరుణి! యేపురకంటె నొక్కరుఁడు భర్త, యగుట లగ్గు జూదంబున నాలి నోటు
వడనివానిఁ గాఁ దగుభర్తఁ బడయు మింక, నను మ రాధేయుఁ డుల్లసమాడె నంత."

మఱియు నితండు చంద్రవంశపురుషక్రమమున కనుగుణ మగురీతిని మూలమందు యయాతికథకంటె ముందుగా నున్నశకుంతలోపాఖ్యానము నాంధ్రమున యయాతిచరిత్రమునకుఁ దరువాతనే పెట్టినట్లే యన్యోపాఖ్యానములచే నుక్తార్థము లగుచిన్నచిన్నకథలను స్పృశించి విడుచుట మొదలుగాఁ గథారంజకత్వమున కభ్యంతరముఁ గలిగింపని మార్పులు సందర్భోచితముగ నొనరించెను. ఒక్కొ

క్కచోఁ గొన్ని వచనము లధికముగాఁ జేర్చుటయుఁ గల దని యిదివఱకుఁ దెలిపి యుంటినిగదా! ఇందుల కొక్కయుదాహరణము.

ఆరణ్యపర్వము—(అగస్త్యచరిత్రము.)

అగస్త్యుఁడు లోపాముద్రను దన కిచ్చి పెండ్లి సేయు మని కోరఁగా విదర్భుఁడు సంకోచించి భార్యకడ కేగి 'ఈముని వీర్యవంతుఁడు కోపగించెనేని శాపాగ్నిచే మనల దహించు' నని చెప్పి విచారించుచుండఁగా, లోపాముద్ర తండ్రిని జూచి 'నాయనా! నీకు నావలన బాధ రాఁదగదు. న న్నామునికి' మ్మని చెప్పినట్లు నతం డట్లొనరించినట్లును మూలమునఁ గలదు. అందీక్రిందిపద్యార్థమును సూచించువాక్య మొక్కటియు లేకపోయినను సందర్భానుగుణముగాఁ గరుణారసోచితముగా నిది కల్పింపఁబడినది.

ఉ. "నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారమునం గృశుం డయినబ్రాహ్మణుఁ డీలలితాంగిఁ బెండ్లియై
నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారము దాల్చి యుండు నని పంపక మిన్నక యుండ నిచ్చునే."

నన్నయకవిత్వవిశేషములు.

ఈమహాకవికవిత్వమే తరువాతికవులకు లక్షణముగాను లక్ష్యముగాను గూడఁ బ్రామాణికమైనట్లు:—

క. "మున్ను దెలుఁగునకు లక్షణ, మెన్నఁడు నెవ్వరును జెప్ప రేఁ జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ, నన్నయభట్టాదికవిజనంబులకరుణన్."

అను కేతనోక్తియే చాటుచున్నది. ఇతని 'కపిలజడలు, కపిలకన్నులు' ఇత్యాది ప్రయోగములను జూచియే లాక్షణికులు 'పెద్దలు వ్యవహరించినప్రయోగములు లక్షణవిరుద్ధములుగా నున్నను బ్రయోగార్హములే' యని సూత్రము కల్పించికొని దానినే యందులకుదాహరించుచు వచ్చిరి. ఇట్లే మఱికొన్ని సంధివిశేషంబులకును బ్రయోగవైచిత్ర్యంబులకు నీకవిత్రయమువారిప్రయోగము లుదాహరణము లగుట యెల్లరు నెఱింగినదే.

మఱియు నీతనివివిధగతు లగుసీసపద్యంబులఁ గనియే భీమకవ్యాదులు తమ ఛందస్సులలో 'అవకలిసీసము, అక్కిలివడిసీసము, అక్కిలిప్రాససీసము' మొదలగువానిలక్షణము లేర్పఱిచినట్లు కనఁబడుచున్నది.

ఇందులకు లక్ష్యలక్షణములు.—

సీ. "వారణావతమునవా రెల్లఁ బాండవా,గమనంబు విని సంతసమునఁ బెరిఁగి
కర మొప్పఁ గరిరథతురగబలాఢ్యులై, యెదురు వచ్చిరి మహాముదముతోడ..."

ఇత్యాదినన్నయలక్ష్యము.

సీ. "పాదంబు నాలుగుపాదముల్ గాఁ జేసి, మొదలిమూఁటికి లోకవిదితమైన
... ... ... ... ...
సమసీసములు చెప్పఁ దమరంగ రెంటికిఁ, బ్రాసముల్ వేఱుగాఁ జేసి యొనర..."

ఇత్యాదిభీమనయుపకలిసీసలక్షణము.

సీ. "కరువలిచేఁ దూలుకపిలజటాలియు, కర మొప్ప శిఖులుగాఁ గనకగత్న..."

సీ. "కమనీయధర్మార్థకామమోక్షములకు, నత్యంతసాధనం బైనదాని..."

ఇత్యాది నన్నయలక్ష్యములు.

సీ. "అమరు ముక్తైకొన్నయతిపాద మంద్రెల్ల, నడరినవడిసీస మనఁగఁబరఁగు
నర్థమర్థమునకు యతులు వేరై చనఁ, జెప్ప నక్కిలివడిసీస మయ్యె..."

వడిసీసము, అక్కిలివడిసీసములకు భీమనలక్షణములు.

సీ. "పలుకులముద్దును గలికిక్రాల్గన్నుల, తెలివును వలుదచన్నులబెడంగు
నలఘుకాంచీపదస్థలములయొప్పును, లలితాననేందుమండలమురుచియు
నలినీలకుటిలకుంతలములకాంతియు, నెలజవ్వనంబున విలసనమును
నలసభావంబున పొలుపును మెలుపును, గలుగుపగ్గిరికన తలఁచి తలఁచి"

ఇత్యాదినన్నయలక్ష్యము.

సీ. "వృత్తంబునకు వలె వెలయు నాల్గడుగుల, వెసఁ బ్రాసములు నిల్పి విరతు లునుపఁ
బ్రాససీసంబగుఁ బశ్చిమార్ధమునట్లు, భాసిల్ల నక్కిలిప్రాససీసము..."

భీమనయక్కిలిప్రాససీసలక్షణము.

ఇవ్విధముగా భీమనఛందస్సులోని సీసపద్యలక్షణములకు నన్నయసీసములు ప్రమాణములుగా నున్నవి. మఱియు నితండు వివిధము లగుసమవృత్తములు విషమవృత్తములను దనభారతమున వ్యవహరించి తరువాతివారికి వృత్తముమార్గమును జూపినవాఁడు. ఈతనికిఁ బూర్వము తెలుఁగులో నిట్టివృత్తములు వాడుకలో నున్నవో లేవో యని చర్చించుట యప్రస్తుతము గాని యితఁ డిట్టివృత్తముల నాంధ్రమున రచియించుటలో సంస్కృతవృత్తలక్షణమునకుఁ దోడుగాఁ గర్ణాటపండితుఁ డగునారాయణభట్టుసాహాయ్యము కూడ నధికముగాఁ గలిగియుండు నని చెప్ప వచ్చును. ఎట్లయిన నేమి? మన కిప్పటికిఁ దెలిసినంతలో నాంధ్రకవులకు గద్య పద్యములమార్గమును జూపినమహర్షి యితఁడే యని తలంపనచ్చును. ఇఁక నీతని ప్రసంగ మిట్లుంచి తిక్కనసోమయాజి భాషాంతరీకరణాదికముం గూర్చి ప్రసంగింతము.

## తిక్కనకవిత్వము.

భారతసాగరంబుదరి సేరి సానదీతతిసమణియైన యీయుత్తమకవిసత్కవిత్వము తొలుదొల్త నిర్వచనోత్తరరామాయణరచనంబునఁ బ్రౌఢస్థితికి వచ్చి విరాటంబున వీనులవిందై యుద్యోగంబున హృదయరంజకంబై యుద్ధపంచకంబున రససంబద్ధంబై శాంత్యాదులఁ జల్లునై, మృదుమధురమై కదళీపాకమున రంజిల్లు. ఇతనికవిత్వంబున రెండువంతులు దెలుగుపదంబులు నొకవంతు సంస్కృతపదంబులు నుండు ననుట నిక్కము. తఱచుగా వ్యవహారమునఁ గనఁబడుచుండెడి యీతని పదములకూర్పు మిక్కిలి సమంజసమై వ్యర్థత్వపౌనరుక్త్యాది దోషంబులకు నెలవుగాక భావగర్భితమై శ్రోత్రపేయముగ నుండు ననుట కాతని యీక్రిందిపద్యమే ప్రమాణము.

ఉ. "కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయసంస్కృతి
శ్రీవిభవాస్పదం బయినచిత్తముతోడ మహాకవిత్వదీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్."

ఈతనియీదీక్ష యాద్యంత మొక్కవిధముగాఁ బద్యగద్యరచనయందుఁ జక్కనిశైలిని బోషించుచు వచ్చిన దనుట నిస్సంశయము. అందందు దీర్ఘసమాసము లుపయోగించుటయు సంస్కృతపదంబు లధికముగాఁ బ్రయోగించుటయుఁ గూడఁ గానవచ్చునుగాని మొత్తముమీఁదఁ జిన్నచిన్నపదములు సేర్చి యతిప్రాసములకుఁ దడవుకొనక కవిత్వము సెప్పుటయే యితనికి నైజము. కావుననే యీతని పద్యశైలి వచనశైలిని బోలియుండును. ఒకొక్కచోఁ జిన్నచిన్నవాక్యములతోఁ గూడియుండియు నితనిశైలి ధారాళమై విరాజిల్లుచుండు. మఱొక్కచో యతిప్రాసస్థానములయందలిపదములవిఱుపు పద్యము నడకను మందగింపఁ జేయును. ఇట్లు వలసినట్లెల్లఁ గవిత సెప్పనేర్చినవాఁడు గావుననే యితఁడు కవిబ్రహ్మ యని వన్నెకెక్కెను. వివిధసందర్భములయందుఁ బైని జెప్పినట్లుగా వివిధరీతు లీతనిరచనయందుఁ గనఁబడుటంజేసి నన్నయశైలికిం బోలి యీతనిశైలికిఁ బ్రవాహగతి సార్వత్రికముగాఁ గానరాదని తలంపవలసివచ్చినది కాని యాద్యంతమవిచ్ఛిన్నప్రవాహగతి గలశైలితోఁ గవిత్వము సెప్పఁ గలవాఁతి యని యీతనికవితాధోరణి మాత్రము తెల్పకపోదు. ఇందులకు స్థూలదృష్టితో రెండుమూఁడుపద్యము లుదాహరించెదను.

ఉ. "వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగ రాదు రా
లచ్చికి నై పెనంగినబలంబులు రెండును గెల్వనేర్చునే?
హెచ్చుగుఁ గుందగుం దొడరు టెల్లవిధంబులకోర్చు టట్లు గా
కిచ్చఁ దలంచి యొక్కమెయి నిత్తఱిఁ బొం దగుచేఁతయుం దగున్

శా. శక్తిస్ఫారధనంజయాయతభుజాసంరంభగాండీవని
ర్ముక్తక్రూరశరావలీదళితశత్రువ్రాతముల్ శోణితా
సిక్తాకారతఁ బొంది సాంద్రకుసుమశ్రేణీవికారోల్లస
ద్రక్తాశోకతరువ్రజంబులక్రియన్ రంజిల్లి యొప్పెం గడున్.

క. వారు దెస లొత్తికొని యుధ,రారాజ్యం బిచ్చిపోయిరా పోరా తా
రారణ్యాపీడఁ బడియును, రారాజుం జెఱుకుఁ బాపరా మన మెఱుఁగన్."

తుదిపద్యముయొక్క శైలి సమవృత్తములయందుఁ దఱచుగాఁ గానరాదు. ఇందు యతిస్థానము పద్యమధ్య మగుట యొకవిధ మైనయందమును దెచ్చునుగాని పదమునం దొక్కయక్షరమే పూర్వాపరపాదములలో మిగిలిపోవుట మాత్రము పద్యగతి కందము తేఁజాలదు. ప్రౌఢశైలీలక్షణములలో నొకటి యగునీ పదములవిఱు పీతనికిఁ జక్కగాఁ గుదిరి విశేషముగా నీతనికందపద్యములఁ గానవచ్చును.

తిక్కనభాషాంతరీకరణము చాలవఱకు నన్నయమార్గము ననుసరించినది గాని కొన్నిచోట్ల యథేచ్ఛముగాఁ గథ పెంచుటయు మఱికొన్నిచోట్ల మూలమునందలి చిన్నకథలు విడుచుటయు నిఁకఁ గొన్ని తావులఁ గొన్ని భాగములను మిక్కిలి సంగ్రహించుటయుఁ గొన్ని భాగములు ముందువెనుకలు సేయుటయు మొదలుగాఁ గలమార్పు లీతనిరచనయందు విశేషముగాఁ గానవచ్చును. స్థూలదృష్టితోఁ బరికింపఁగా నితఁడు విరాటపర్వము మాత్రము కొంచెము పెంచి మిగిలినపర్వము లన్నియు సంగ్రహించినట్లే కనఁబడును. ఇట్లున్నను మిగిలినమూలభావానుసరణాదులయం దీతనిరచన నన్నయరచన కీడు వచ్చుచునే యున్నది. ఇందుల కందందలివి కొన్ని యుదాహరణములు.

సంస్కృతవిరాటపర్వము మొదలఁ బాండవులజ్ఞాతవాసకర్తవ్యవిధి నాలోచించికొనిన పిదపనే బ్రాహ్మణులను బరిచరవర్గంబును బంపిన ట్లుండఁగా నిందు మొదలనే విప్రులను బాహ్యపరివారంబును బంపి తరువాత ధౌమ్యునితోఁ గూడ రథారూఢులై క్రోశమాత్రదూర మేగి యచ్చట నజ్ఞాతవాసవిషయ మాలోచించికొని నట్లుగా నున్నది. బహుజనమధ్యంబున రహస్య మాలోచించికొని రనుట మంచిది గాదనియు, నాంతరంగికులైనధౌమ్యాదులున్నను గార్యహాని గాదనియుఁ దలంచి తిక్కన యిట్లు మార్చియుండునేమో కాని కేవలపాండవపక్షపాతులై వారితోఁగూడ నడవుల నిడుమలు పడుచున్నయావిప్రాదు లున్నపుడే యజ్ఞాతవాసనిర్ణయమును జేసికొనిరనెడి మూలమునం దౌచిత్యభంగ మేమియు లేదని యూహింపవచ్చును. అయిన నిందలితిక్కనయభిప్రాయ మింకను విచారణీయము.

మూలములో ధౌమ్యుఁడు పాండవులకు రాజసేవాధర్మము లెఱిఁగించిన ప్రకరణ మాంధ్రమున నెంతయు మార్పు నెందినది. అందలినాలుగైదు శ్లోకముల తాత్పర్యముమాత్ర మిందుఁ గనఁబడును. మూలములో లేనిధర్మములు కొన్ని యిం దధికముగా నున్నవి. తక్కిన రాజసేవాధర్మములను జక్కఁగా నెఱింగినవాఁ డగుటచే స్వానుభవమును లోకానుభవమును బట్టి యధికముగాఁ జేర్చుట యుచితము గానే యున్నది గాని మూలమందలి కొన్నిమంచినీతుల నందు విడనాడుట భాషాంతరీకరణధర్మమునకు భిన్నము గాకపోదు. కాని సంస్కృతమును జూడక యాంధ్రమునే చదువువారికీప్రకరణ మాహా పుట్టించుట యబ్బురము గాదు. ఇందలి వొకటిరెండు:—

"శ్లో. నైషాం దారేషు కుర్వీత మైత్రీం ప్రాజ్ఞః కదాచన,
అంతఃపురచరా యే చ ద్వేష్టి యా నహితాశ్చ యే."

క. "అంతిపురిము చుట్టుటకం, బెంతయుఁ గీడంతకంటె నెగ్గు తదీయో
పాంతచరకుబ్జవామన, కాంతాదులతోడిపొందుగలిమి ఘటుసకుఱ."

'రాజభార్యలతోను, అంతఃపురమునఁ దిరుగువారితోను మైత్రి చేయరాదు. రాజు ద్వేషించువారితోను రాజశత్రువులతోను మైత్రి చేయరాదు.' అని మూలమునర్థము. ఇందు రెండవభాగము విడువఁబడినది. మొదటిభాగములోనియర్థము కొంచెము వ్యక్తీకరింపఁబడినది. ఇఁక:—

1. "రాజగృహంబుకంటె నభిరామముగా నిలు గట్టఁ గూడదు.
2. ధరణిపుచక్కఁ గట్టెదురు దక్కఁ పిఱుందును గాని యట్లుగా
3. ఎండకు వాన కోర్చి తనయిల్లు ప్రవాసపుఁ జోటునాక."

ఇత్యాదిపద్యములలో మూలములోని యొకటిరెండుపదము లున్నవో లేవో యని చెప్పఁ దగిన ట్లున్నది.

శ్లో. "యో న యానం న పర్యంకం న పీఠం న గజం రథమ్,
ఆరోహే త్సమ్మతో 'స్మీతి స రాజవసతిం వసేత్."

శ్లో. "యానం వస్త్ర మలంకారం య చ్చాన్య త్సంప్రయచ్ఛతి,
త దేవ ధారయే న్నిత్య మేవం ప్రియతరో భవేత్."

ప్రకరణమున నాద్యంతములయం దున్నయీ రెండుశ్లోకముల భావమునకు ముడివెట్టి యీ క్రిందిపద్యము రచియింపఁబడిన ట్లున్నది.

ఆ. "ఉత్తమాసనములు నుత్కృష్టవాహనం, బులును గరుణఁ దమకు భూమిపాలుఁ
డీక తార యెక్కు టెంతటిమన్ననను, గలుగువారి కైనఁ గార్య మగునె?

మూలములోని,

'అమ్లానో బలవాన్ శూరః శ్చాత్రేః వానుగతస్సదా' యనునది మొదలుగాఁ బెక్కుశ్లోకము లాంధ్రీకరింపఁ బడలేదు. ఇట్లే యీప్రకరణము యథేచ్ఛ రచనఁ గాంచినది. మఱియుఁ గీచకుఁడు సైరంధ్రిని గూర్చి పలికినయను రాగవచనములు మూలమునకంటె విశేషించి శృంగారప్రధానముగా నిందు వివరింపఁ బడినది.

భీష్ముం డర్జునునియజ్ఞాతవాసవత్సరవ్యాప్తి నిర్ణయించుసందర్భమున మూలములో:—

శ్లో. "ఏవం కాలవిభాగేన కాలచక్రం పరివర్తతే,
తేషాం కాలాతిరేకేణ జ్యోతిషాంచ వ్యతిక్రమాత్.
పంచమే పంచమే వర్షే ద్వౌ మాసా వుపజాయతః,
ఏషా మభ్యధికామాసాః పంచ చ ద్వాదశ క్షపాః.
త్రయోదశానాం వర్షాణా మితి మే వర్తతే మతిః,
సర్వం యథాప చ్చరితం యద్య దేభిః ప్రతిశ్రుతమ్.
ఏవ మేత ద్ధ్రువం జ్ఞాత్వా తతో బీభత్సు రాగతః."

ఈమూలమును వ్యాఖ్యాత యగునీలకంఠభట్టాచార్యుఁ డిట్లు వి

"...అత్ర చతుర్వింశత్యా పక్షై శ్చాంద్ర స్సంవత్సరః చతుష్పంచాశద యదినాత్మకః పంచషష్ఠ్యుత్తరత్రిశతదినాని, పంచదశఘటికాః, ఏకత్రింశద్వినాడ్యః, త్రింశదక్షరాణి, సౌరసంవత్సరస్య మానమ్. షష్ట్యధికశతత్రయదినాత్మక స్సావనసంవత్సరః. తత్ర ప్రతిజ్ఞానిర్వహణాది ప్రాయశ్చిత్తక్రియా స్సావనమానేనైవ నిర్వర్త్యాః. న సౌరమానేన, న చాంద్రమానేన, తథేతి శాస్త్రనిశ్చయాత్ ......యదా సౌరచాంద్రమానయో రాంతరాళిక స్సావన స్సౌరమానేన సాకం సమీక్రియతే. తదా సౌరమానగతా వృద్ధి స్తత్ర లభ్యతే తథైవ సౌరచాంద్రమానయో ర్విషయేఽపి సాషురస్యే క్రియమాణే త్రయోదశసు సౌరసంవత్సరేషు గతేషు పంచచాంద్రమాసాః కించిదభ్యధికద్వాదశదినా న్యధికాని భవంతీతి జ్ఞేయమ్. ఏవ మేవ క్రమేణ సావనమానానురోధేన గణనాయాం క్రియమాణాయాం త్రయోదశసౌరసంవత్సరపరిపూర్తే స్సపాదాష్టషష్టిదినేభ్యః పూర్వమేవ త్రయోదశసావనసంవత్సరాణాం పరిపూర్తిస్సమగ్రతయా జాయతే. తస్మా ద్యథా ప్రతిశ్రుతం త్రయోదశవత్సరాః పూర్వ మేవ నిర్వృత్తా ఇతి...నిశ్చిత్య పాండవై ర్యథా ప్రతిజ్ఞ మాచరిత మిత్యుక్తమ్." (అర్థసంగ్రహము):—

354 దినము లొకచాంద్రమానసంవత్సరము.

365 దినములు, 15 ఘటికలు, 31 విఘటికలు, 30 అక్షరములు.

1 సౌరమానసంవత్సరము. 360 దినము లొకసావనసంవత్సరము.

ప్రతిజ్ఞానిర్వహణాదులయందు సావనసంవత్సరమే యుపయోగింపఁ దగు నని గార్గ్యవచనము చెప్పుచున్నది. '13 సౌరసంవత్సరములలో, 5 మాసములు 12 దినములు కొన్నిగడియ లెక్కువగా 13 చాంద్రసంవత్సరములుండును. ఇట్లే 13 సౌరమానసంవత్సరములలోను 68 దినములు 15 ఘటికలెక్కువగా 13 సావనమాన సంవత్సరము లుండును. కాఁబట్టి నేఁటికి 68 దినములు 15 ఘటికలకుఁ బూర్వమే 13 సావనసంవత్సరములు నిండినవి. పాండవులు ప్రతిజ్ఞాప్రకారము నడచుకొనిరి. అని (భీష్ముని) నాయభిప్రాయము.'

దీనింబట్టి భీష్ముఁ డజ్ఞాతవత్సరవ్యాప్తి నిష్కర్షించునాఁటికి 68 దినములు 15 ఘటికలకు మున్ను సావనమానంబున 13 సంవత్సరములు నిండినట్లు తెలియుచుండుటచే, సావనసంవత్సరము, ఒకటికి 5దినములు 15గడియ లెక్కువ చొప్పున సౌర సంవత్సరమునకు లెక్కచూచికొనఁగా నయ్యఱువదియెనిమిదిదినములు పదియేనుగడియలు కలిపికొని 13సౌరసంవత్సరములును నాఁటికిఁ బూర్వదినముతో నిండినట్లు కనబడుచుండుటంబట్టి యీవ్యాఖ్యాన మాధారముగానో మఱియెట్లో తిక్కనార్యుఁడు తెలుఁగులో—

సీ. "రెండవయేట నొక్కండ దధిమాస మి, క్లెక్కిన యన్నెల లెల్లఁ గూర్చి
కొనఁ బదుమూఁడు హాయనములు తప్పక, నిన్నటితోడన నిండె నింత
యెఱిఁగియె తమపూన్కి యెల్లను దీర్చితి, మని పాడనూపె నయ్యర్జునుండు .."

అని 'నిన్నటితోడన నిండె' ననుచు నూఁదిపలికి సౌరమానమునఁ గాలనిర్ణయ మొనరించినట్లు కనఁబడుచున్నది. కాని మూలములో నీ 13 సంవత్సరములలోను 5 మాసములు 13 దినము లధికముగా వచ్చిన వని యుండుటచే నవి చాంద్రమానాబ్దము లగుటం బట్టి క్రిందిపట్టికప్రకార మప్పటికి సౌరాబ్దములు 13 నిండుటకు 13¼ దినములు తక్కువ యయినట్లు తెలియుచున్నది. ఎట్లనఁగా? (ఈలెక్కలో సుమారు కొన్నిగడియలకాలము గణింపఁబడలేదు.)

| | | ది. | గ. |
|---|---|---|---|
| 13 సౌరాబ్దములకు దినములు— | | 4748 | 15 |
| 13 చాంద్రాబ్దములకు దినములు. | 4602 | 4761 | 30 |
| అధికమాసదినములు. | 159½ | | |

దీనింబట్టి భీష్ముఁడు చేసినకాలనిర్ణయమునాఁటికే 13 సౌరాబ్దములు నిండె నందుమా? ఈ 13 సం. లో మా. 5, ది. 12 లధికముగా వచ్చిన వని చెప్పెడి మూలము విరుద్ధమగును. ఇది సరియందుమా? అట్లయినసౌరాబ్దములు 13 నిండుటకు 13¼ దినము లప్పటికిఁ దక్కువ యగును. ఇట్లెవిశ్వసింతుమా? "నేఁటికి 68¼

దినములకుఁ బూర్వమే సావనాబ్దములు 13 నిండిన" వనెడువ్యాఖ్యానము విరుద్ధమగును. అధికమాసదినములగణనము చేసియు

"... ... ... ఇతి మే వర్తతే మతిః,
సర్వం యథావ చ్చరితం య ద్య దేభిః ప్రతిశ్రుతమ్."

అని భీష్ముఁడు చెప్పిన ట్లుండుటచే నీసంవత్సరగణనమున సావనమానమే యుపయోగింపఁబడినట్లు మూలాభిప్రాయము కనఁబడుచున్నది.

"పంచమే పంచమే వర్షే ద్వౌ మాసా వుపజాయతః"

అనుదానిని వ్యాఖ్యాతయుఁ దిక్కనార్యుఁడు గూడ గ్రహించినట్లు కానరాదు. ఇట్లీగణనవిషయము పరస్పరవిరుద్ధ మయినట్లుండఁగా, "రెండవయేట నొక్కం డధిమాస మి ట్లొక్కనయన్నెల లెల్లఁ గూర్చి" యనునది మొదలుగాఁ దిక్కన సౌరాబ్దములకు సరిపడునట్లుగా 'నిన్నటితోడనె నిండె' నని ప్రతిజ్ఞావత్సర నిర్ణయ మెట్లొనరించెనో యూహింప రాకున్నది. భారతసందేహములలో నొకటిగా నున్న యీవిషయమును విద్వల్లోకము విమర్శించుఁగాక.

మఱియు నుద్యోగపర్వమునఁ బ్రజాగరపర్వమునందు విదురుఁడు ధృతరాష్ట్రునకుఁ జెప్పిననీతి, మూలమున దాదాపు 700 శ్లోకములలో వివరింపఁబడియున్నది. అది తెలుఁగులో సుమారు 70 పద్యగద్యములలో నిమిడినది. గ్రంథబాహుళ్యముచేఁ బ్రిధానకథ కభ్యంతరము గలుగునని యిది యిట్లు సంగ్రహింపఁబడియుండును గాని విశేషించి రాజనీతిని దెల్పునీభాగమును సోమయాజియే తెలిఁగించినచో లోకమున కెంతయు మహానందదాయకమైయుండును. సంస్కృతమును సరిగా ననుసరించి నేనీవిదురనీతిని దెలిఁగింపఁగా సుమారు 360 పద్యములు పట్టినవి. ఇట్లే సోమయాజి సనత్సుజాతీయమును గూడ మిక్కిలి సంగ్రహించెను. అధ్యాత్మ తత్త్వమును బోధించు నీభాగమును గూడ భగవద్గీతాప్రకరణమువలెనే కవి యించుక స్పృశించి విడిచిపెట్టుటకు గ్రంథవిస్తరభయమే కారణమై యుండు నని యూహింపఁ దగియున్నది. పెక్కుపర్వములను దెలిఁగించినయితఁ డనేకభాగముల నిట్లు సంగ్రహించుటచేతను విడుచుటచేతనే మూలగ్రంథసంఖ్య తెలుఁగులో నాలవ వంతునకు దిగిన దని చెప్పవచ్చును.

పై ప్రకరణములలో భగవద్గీతలకును సనత్సుజాతీయమునకును శ్రీశంకరభగవత్పాదులు భాష్యము రచియించి రనుటయే వానిమహత్త్వమును లోకహితత్వమును దెలుపఁగలదు. అట్టియాప్రకరణములను గర్మజ్ఞాననిష్ఠుఁడగు తిక్కనసోమయాజి తెలిఁగింపక పోవుటచే నాంధ్రభాష శ్లోకలోపము గలిగిన దనియే చెప్ప

వచ్చును. ఇటీవలఁ గొంద ఱాయా ప్రకరణముల నాంధ్రీకరించినను దక్కినయాంధ్రభారతభాగములకు వచ్చినప్రతిష్ఠ వీని కేల వచ్చును?

మఱియుఁ దిక్కన కొన్నికొన్ని శ్లోకములభావము మూలమునందు గుప్తముగా నుండఁగా వాని నట్లే తెలిఁగించెను గాని వివరింప లేదు. ఇందులకు—

"ఏకయా ద్వే వినిశ్చిత్య త్రీం శ్చతుర్భి ర్వశే కురు,
పంచ జిత్వా విదిత్వా షట్ సప్త హిత్వా సుఖీ భవ."

గీ. "ఒకటి గొని రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి, మూఁటి నాల్గింటిఁ గడువశ్యములుగఁ జేసి
యేనిటిని గెల్చి యాఱింటి నెఱిఁగి యేడు, విడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు."

మఱియు సోమయాజి యందందు సందర్భానుసారముగా మూలకథయందు స్వకవిత్వమును జొనిపి కథను సరసముగాఁ బెంచుట గానవచ్చును. ఇందులకు శ్రీకృష్ణునిరాయబార మొకటి యుదాహరణముగాఁ గైకొందము. పాండవులు శ్రీకృష్ణునితోఁ దమతమయభిప్రాయములు దెలుపుసందర్భముల మూలములో లేని వెన్నో యాంధ్రమునఁ జేర్పఁబడినవి. ధర్మరాజాదులస్వభావముల కనుగుణముగాఁ దత్తద్రసోచితముగా వారివారిమాట లాంధ్రమున నెంతయు రుచిపుట్టించుచున్నవి గాని మూలమం దీమాటలే కానరావు. మూలమున నకులవాక్యములయందు శాంతి యేమియుఁ గానరా కుండఁగాఁ దెలుఁగులో:—

క. "కడవఁగ నొకళ్లు పసరము, నడిచిన నొక్కటులు పెయ్య నడునవలయునే
చెడు తెరు వాకౌరవ్యుల, కడ నిలుచుంగాక మనకుఁ గార్యం బేలా!"

అనుపద్యము కల్పింపఁబడినది.

మఱియు సహదేవుఁడు 'ఎట్లయిన యుద్ధమే కావలయు' నని చెప్పినమూలములోని మాటల కనుగుణముగా నున్నను

మ. "తుది రాజ్యమ్ము సగమ్ము గొమ్మడవియందుం బేరు పంచించియుం
బదుమూఁడేడులు నీవునుం దిరిగి రా పా లీకపోవచ్చునే
యది గాదేఁ దెగి బంటవై యాలము మాయల్ వన్నునే ర్పెంకఁ జె
ల్లదునూ నీ కని యాసుయోధనునియల్లం బుచ్చి పో నాడుమీ!"

అనుపద్యము సరసముగాఁ గల్పింపఁబడినది.

మఱియు ద్రౌపదియభిప్రాయమును దెలుపు తెలుఁగుపద్యములు చాలవఱకు మూలము ననుసరించినవి గాని యందలితీవ్రత మాత్ర మంతగాఁ దెలుఁగులోనికి రాలేదు. కొన్నికొన్నిమాటలును విడిచిపెట్టఁబడినవి. కొన్నిమాట లధికముగాఁ జేర్పఁబడినవి.

**ఇందుల కుదాహరణములు:—**

శ్లో. "నహి సామ్నా న దానేన శక్యోఽర్థ స్తేషు కశ్చన,
తస్మా త్తేషు న కర్తవ్యా కృపా తే మధుసూదన!
సామ్నా దానేన వా కృష్ణ! యేన శామ్యంతి శత్రవః,
యో క్తవ్య స్తేషు దండ స్స్యా జ్జీవితం పరిరక్షతా.
తస్మా త్తేషు మహాదండః క్షేప్తవ్యః క్షిప్ర మచ్యుత!
త్వయా చైవ మహాబాహో! పాండవై స్సహ సృంజయైః."

పైశ్లోకముల తాత్పర్యము తెలుఁగునఁ గనఁబడదు. మఱియు

"ఏ నిటు లంటి నా వలన దింకను"

"ఆఱడిఁబోకయుఁ ఫలము నందుటయుం గని పల్కు"

యనునవి మొదలుగాఁ గొన్ని యమూలము లిందుఁ గలవు. ఇట్లే యీతని యాంధ్రీకరణమున వివిధము లగుమార్పులు గనఁబడును. గ్రంథవిస్తరభయమున నింకఁ బెక్కుదాహరింపక యెఱ్ఱనార్యుని భాషాంతరీకరణముం గూర్చి యించుక తెల్పెద.

## ఎఱ్ఱాప్రెగడ కవిత్వము.

ఆంధ్రమహాభారతము కొఱంతను దీర్చినయీకవీంద్రునికవిత్వము "నన్నయభట్టమహాకవీంద్రు, సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁ జేరుటయు" అని వ్రాసికొనుటకుఁ దగినట్లుగాఁ బెక్కువిధముల నన్నయకవిత్వమునే యనుసరించిన దని చెప్పవచ్చును. ఈతనియాంధ్రీకరణపద్ధతియు నన్నయమార్గమునే పోలియుండును. నన్నయ యారంభించినశరత్కాలవర్ణనమునడుమ నారంభించినయితఁ డాతనిశైలినే చాలవఱ కనుకరించిన ట్లీక్రిందిపద్యములే తెలుపఁగలవు.

ఉ. "శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపంక్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవకైరవగంధబంధురో
దారసమీరసౌరభము దాల్చి సుధాంశువికీర్యమాణక
ర్పూరపరాగపాండురుచిపూరములం బరపూరితంబులై." (నన్నయ)

చ. "స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా
వరణములై దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్." (ఎఱ్ఱన)

మఱియు నితండు నన్నయ తెలిఁగించినభాగమును గంఠపాఠము గావించి యాతనిశైలియందలితమకముచే నాతఁడు ప్రయోగించినపదవాక్యజాలమునే తఱచుగా నుపయోగించుచు వచ్చెను. ఇందుల కొక్కయుదాహరణము.——

ఉ. "నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారమునన్ ... ... ..." (నన్నయ)

ఉ. "నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులో విప
ద్భారము ... ... ..." (ఎఱ్ఱన)

ఇట్లున్నను మొత్తముమీఁద నీతనికవిత్వము ధారాళశైలియెడ నన్నయకవిత్వముతోఁ దులతూఁగక పోయినను జాలవఱకు దానిచిన్నెలు గలిగి, కొన్ని ప్రౌఢగతులఁ దిక్కనకవిత్వముతోఁ సరిరాకపోయినను దానివన్నెలు కొన్ని నేకరించి యాయుభయకవిత్వములకంటె వేఱుపడుచుఁ దిక్కనయర్వాచీనకవిత్వము కంటె నుత్తమమై యలరారుచున్నది.

ఈప్రబంధపరమేశ్వరుఁడు తెలిఁగించినభాగము చిన్నదియే యైనను, ఇందు మార్కండేయుని యుపదేశము, ధర్మవ్యాధవృత్తాంతము దుర్యోధనుని ఘోషయాత్ర, శ్రీరామచరితము యక్షప్రశ్నములు, సావిత్రీచరిత్రము మొదలగు ప్రశంసనీయము లగుకథాంశము లనేకములు గలవు. ఇందును శ్రీరామకథ సంక్షేపముగా నుండుటచేతనే యితఁ డాకథయందలియాసక్తి తీఱక వాల్మీకిరామాయణమును వేఱుగాఁ దెలిఁగించినవాఁ డయ్యె నని యూహింపఁదగును. అయిన నేమి? అది యాంధ్రభాషదురదృష్టవశంబున స్మరణీయ మగుట యెంతయు శోచనీయము.

ఇతనిరచనలో నొకవంతు తెలుఁగుపదములు నొకవంతు సంస్కృతపదములు కన్పట్టును. మఱియు దీర్ఘసమాసము లుపయోగించుటయందును జిన్నచిన్న పదములు కూర్చుటయందును గూడ నేర్పుగలయీతనికవిత్వము ద్రాక్షాపాకంబున విలసిల్లు.

### ఎఱ్ఱనార్యుని యాంధ్రీకరణము.

మూలమును దాఁటుమాఱు గావించుట లేకపోయిన నీతనిరచనయందు మూలమును సంగ్రహించుటయు నందందుఁ బెంచుటయుఁ గన్పట్టకపోవు. ఇందుల కొకటిరెం డుదాహరణములు.

మార్కండేయోపదిష్టము లైనయుపాఖ్యానము లిందు మిక్కిలి సంగ్రహింపఁబడినవి. అందు ధుంధుమారోపాఖ్యానము యథేచ్ఛముగాఁ దెలిఁగించెను. అందలినొక్కటి,

శ్లో. "మహర్షి ర్విశ్రుత స్తాత! ఉదంక ఇతి భారత!
మరుధన్వసు రమ్యేషు ఆశ్రమ స్తస్య కౌరవ!
ఉదంక స్తు మహారాజ తపోఽతప్య త్సుదుశ్చరమ్,
ఆరిరాధయిషు ర్విష్ణుం బహూన్ వర్షగణాన్ విభుః."

ఉ. "శంకరసన్నిభుండు జనశంకరసత్కరుణాకరుం డనా
తంకుఁ డుదంకుఁ డన్మునివృతస్థితుఁడై మరుభూమియందు ని
శ్శంకమతిన్ వసించి యనిశంబును నవ్యయు నచ్యుతున్ మన
పంకజవేదిపై నిడి తపం బొనరించె ననేకవర్షముల్."

ఇందు మూలములో లేనిపదము లధికముగాఁ జేర్చుటయే కాక 'శంకర సన్నిభుం' డను విశేషణమును జేర్చి యెఱ్ఱన తనశంభుదాసత్వమును బ్రకటించి కొనెను.

ఈక్రిందిశ్లోకములలోని విషయము కొంతవిడువఁబడినను వీనియాంధ్రీకరణము మంచిశైలిని దెల్పుచున్నది.

శ్లో. "కర్షంతో లాంగలైః పుంసో ఘ్నంతి భూమిశయాన్ బహూన్,
జీవా నన్యాంశ్చ బహుశ స్తత్ర కిం ప్రతిభాతి తే.
ధాన్యబీజాని యా న్యాహు ర్వ్రీహ్యాదీని ద్విజోత్తమ,
సర్వా ణ్యేతాని జీవాని తత్ర కిం ప్రతిభాతి తే.
అధ్యాక్రమ్య పశూం శ్చాపి ఘ్నంతి వై భక్షయంతి చ,
వృక్షాం స్తథౌషధీం శ్చాపి ఛిందంతి పురుషా ద్విజ.
జీవాహి బహవో బ్రహ్మన్ వృక్షేషు చ ఫలేషు చ,
ఉదకే బహవ శ్చాపి తత్ర కిం ప్రతిభాతి తే.
సర్వం వ్యాప్త మిదం బ్రహ్మన్ ప్రాణిభిః ప్రాణిజీవనైః,
మత్స్యా గ్రసంతే మత్స్యా శ్చ తత్ర కిం ప్రతిభాతి తే.
సత్త్వై స్సత్త్వాని జీవంతి బహుధా ద్విజసత్తమ!,
ప్రాణినో ఽన్యోన్యభక్షా శ్చ తత్ర కిం ప్రతిభాతి తే.
జీవై ర్గ్రస్త మిదం సర్వ మాకాశం పృథివీ తథా,
అవిజ్ఞానా చ్చ హింసంతి తత్ర కిం ప్రతిభాతి తే.
అహింసేతి యదుక్తం హి పురుషై ర్విస్మితైః పురా,
కే న హింసంతి జీవాన్ వై లోకేఽస్మిన్ ద్విజసత్తమ!
బహు సంచిత్య ఇతి వై నాస్తి కశ్చి దహింసకః."

మ. "హాలికుం డెంతయు నోజతో దున్నఁగ సీరాగ్రంబునం జోఁకి ప్రా
ణు లనేకంబులు సచ్చు హింస యది యౌనో కాదొ వేయేల మ
ర్త్యులు నేలం జరియించుచోఁ బదములం ద్రొక్కం బడుం బెక్కు జం
తులు హింసావిధి గా దనంగ నశమే దోషజ్ఞ! యూహింపుమా!

చ. సలిలము లుర్వి యాకసము సర్వము జంతుమయంబు గావునన్
గలుగు నవశ్యమున్ సకలకర్మములందును హింస హింసకుం
దొలఁగినదేహయాత్రయును దుర్ఘట మైనటులుండు నింతయున్
దలఁపరు హింస సేయ మని తారు తలంతురు గొంద ఱిమ్మహిన్."

ఇతఁడు ఘోషయాత్రాపర్వమందలిభావ మంతయుఁ జక్కఁగాఁ దెలుఁగున నిమిడ్చెను. మూలభావము సరిగా నిందుఁ గనఁబడుచుండుటచే నాంధ్రీకరణము యథేష్టముగా నున్న దనెడి యాక్షేపణమునకు లోను గాక హృద్య మగుచున్నది. ఇందుల కొకటి రెండుదాహరణములు.

కాఁగలకార్యము గంధర్వులు తీర్చి రనెడిలోకోక్తి కునికిప ట్టయినయీ క్రిందిభీమసేనవాక్యములు

"అస్మాభి ర్య దనుష్ఠేయం గంధర్వై స్తదనుష్ఠితమ్,
అన్యథా వర్తమానానా మర్థో జాతోఽయమన్యథా.
దుర్మంత్రిత మిదం తావ ద్రాజ్ఞో దుర్ద్యూత దేవినః,
ద్వేష్టార మన్యే క్లీబస్య పాతయంతీతి నః శ్రుతమ్.
ఇదం కృతం నః ప్రత్యక్షం గంధర్వై రతిమానుషమ్,
దిష్ట్యా లోకే పుమా నస్తి కశ్చి దస్మత్ప్రియే స్థితః.
యే నాస్మాకం హృతో భార ఆసీనానాం సుఖావహః,
శీతవాతాతపసహాం స్తపసా చైవ కర్శితాన్.
సమస్థో విషమస్థాన్ హి ద్రష్టు మిచ్ఛతి దుర్మతిః."

ఈ క్రింది యాంధ్రీకరణమునఁ గొంత మార్పు నెందియు సరసముగా నున్నవి.

ఆ. "మనకుఁ జిలుక నయ్యె మనచేయుపనియ గం,ధర్వనరులు గూడి తగ నొనర్చి
రింత లెస్స యగునె యేభారమును లేక, యూరకుండ మనల నొంద జయము.

గీ. పుట్టుఁ గల్లరియై పాపములకు నెల్ల, దిట్టయై లోకములచేతఁ దిట్టుపడిన
కట్టిఁడికి నిట్టికష్టంబుగా నొనర్చి, తగ విధాతృఁడు చతురుఁడై నెగడె నేఁడు.

మ. విపరీతస్థితి నొంది ఘోరవిపినోర్వీవాసులై నిత్యదుః
ఖపరాధీనతఁ దూలి రంచు మనలన్ గర్వోద్ధతస్వాంతుఁడై

యుపలాలింపఁగ వచ్చి దుర్నయపరుం డాధార్తరాష్ట్రుండు వి
పరీతాత్ముఁడు తత్ఫలంబు గుడిచెఁ సత్యంబు సామాత్యుఁడై.''

కాని మూలములో భీమవచనములలో లేనిమాటలు గూడ "అనుమాన మొక్కంత యును లేక యలిగి జలంబులఁ ద్రోచె విషంబు వెట్టె" నను సీసపద్యమున నుదాహరింపఁబడినవి.

మూలములోఁ బైసందర్భముననే ధర్మరాజు భీమునితోఁ జెప్పినవాక్యములు తెలుఁగులో సంగ్రహింపఁబడినవి. అందును జక్కని రాజనీతిని దెల్పుచు లోకములోఁ బ్రసిద్ధి కెక్కియున్న యీ క్రిందిధర్మజునివచనము స్పృశింపఁబడనేలేదు.

శ్లో. "పరైః పరిభవే ప్రాప్తే వయం పంచోత్తరం శతమ్,
పరస్పరవిరోధేతు వయం పంచైవ తే శతమ్."

మూలములో యక్షునిప్రశ్నంబులును ధర్మజుని సమాధానంబులును గలిసి 77 శ్లోకముల నొప్పుచున్నవి. ఆప్రశ్నసమాధానములు తెలుఁగున 25 పద్యములలోఁ జెప్పఁబడినవి. ఇందుఁ జక్కని ప్రశ్నంబులు రమారమి యేఁబది విడువఁ బడినవి. వీనిలో నాల్గుప్రశ్నములకు సమాధానములను దెలుఁగున రుచిచూప నుదాహరించెదను.

శ్లో. "కో మోద తే? కి మాశ్చర్యం? కః పంథాః? కా చ వార్తికా?"

1. ఎవఁ డానందించుచున్నాఁడు?
2. ఆశ్చర్య మేది?
3. మార్గ మేది?
4. వార్త యేమి?

1. "పంచమేఽహని షష్ఠే వా శాకం పచతి స్వే గృహే,
అనృణీ చా ప్రవాసీ చ స వారిచర మోద తే."

ఎవఁడు ఋణము చేయక ప్రవాసము చేయక యపరాహ్ణమునఁ గాని సాయాహ్నమునఁ గాని యాకో యలమో తిని తనయింటనే పడి యుండునో వాఁ డానందించుచున్నాఁడు.

2. "అహ న్యహని భూతాని గచ్ఛంతి యమసాదనమ్,
శేషాస్థానవర మిచ్ఛంతి కి మాశ్చర్య మతః పరమ్."

ప్రతిదినమును బెక్కుజీవరాసులు యమమందిరమున కేగుట చూచుచుండియు మిగిలినవారు తాము స్థిరముగా నుందుమని తలఁచుచున్నారు. ఇంతకంటె నాశ్చర్య మేమి కలదు ?

3. "తర్కోఽప్రతిష్ఠ శ్శ్రుతయో విభిన్నా నైకోఋషిర్యస్యమతం ప్రమాణమ్,
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గత స్సపంథాః."

ఊహ స్థిరపడలేదు. వేదములు వేఱుపడుచున్నవి. ప్రామాణికుఁ డయిన ముని యొక్కఁడును గాఁడు. ధర్మతత్త్వమంతయు గుహాలోఁ బూడ్చఁబడినది. ఇఁక నిదంతయు నేల ? పూజ్యు లగుపెద్దలందఱు నేదారిని బోయిరో యదియే మార్గము.

4. "అస్మిన్ మహామోహమయే కటాహే సుర్యాగ్నినా రాత్రిదివేంధనేన,
మాసర్తుదర్వీపరిఘట్టనేన భూతాని కాలః పచతీతి వార్తా."

కాలపురుషుఁ డెల్లభూతముల నజ్ఞానమయమయినయీలోకమనెడిపెద్దపెనములోఁ బెట్టి క్రింద రేయుంబవ లనువంటకట్టెలను దగిల్చి సూర్యుఁ డనునిప్పు రగుల్కొల్పి మంటపెట్టి, మాసములు ఋతువులు ననెడిగరిఁటెలతోఁ ద్రిప్పుచు వండుచున్నాఁ డనుటయే గొప్పవార్త.

ఇట్లే యితఁడును మూలకథ కభ్యంతరము లేకుండఁగ నయ్యాభాగములను సంగ్రహించుచు యథేచ్ఛముగా సరసశైలి నాంధ్రీకరించి యాంధ్రమహాభారతము కొఱంతను దీర్చి భాషకు దేశమునకును మహోపకారము గావించెను.

ఇవ్విధముగా భారతము తెలుఁగులో సంపూర్ణస్థితిని గాంచుటకు సుమారు మూఁడువందలసంవత్సరములకాలము పట్టినది. సోమయాజికిని శంభుదాసునకును నడుమఁ బెక్కుండ్రు కవులు వెలసినట్లు నన్నయభట్టునకును సోమయాజికిని మధ్యకాలమునఁ గూడఁ గొందఱు కవులు వెడలియుండక పోరు. కాని నన్నయార్యునకుంబోలె భారత మాంధ్రీకరింప నారంభించునంతటిప్రజ్ఞాచాతుర్యము పై యిరువురకు మాత్రమే కలిగిన దని యూహింపవలసివచ్చినది. ఆకాలమునఁ దమ కర్హత లేని కార్యములయందు విద్యావంతులు ప్రవేశించెడివారుకారు. కావున భారత మే యాంధ్రభాషలో గౌరవార్హమై గొప్పదియై మొదటిదియై కనఁబడుచుండుటచే నడుమ నడుమఁ గొందఱుప్రామాణికకవులు వెడలినను కవిత్రయసంజ్ఞపై మువ్వురకు మాత్రమే సంభవించినది. ఇది భారతమును మువ్వరు దెలిఁగించుటచే వచ్చినదియే కాక యర్వాచీనకవులకు ముఖ్యముగా వీరు ప్రామాణికులుగాఁ దగుదు రను ప్రఖ్యాతిచేతను గూడ వచ్చిన దని విశ్వసింపఁ దగును. ఇందులకుఁ గవిరాక్షసుఁడు కవిత్రయము

వారు ప్రయోగించినవానికంటె వేఱుపదములను బ్రయోగింప రాదని నియమము చేయుటయే ప్రబలనిదర్శనము. నిజముపరికింపఁగా భారతములో లేనిపదము లితర కావ్యములలో విశేషముగాఁ గానరావు. ఒకవేళఁ గొన్నిపదము లున్నను భారతములోనిపదములకుం బోలె వానికి విశేషవ్యాప్తి గానరాదు. కవిత్రయమువారు ప్రయోగించినవి కొన్నిలక్షణదూరములు గానున్నను వానికిఁ బ్రయోగార్హతయంగీకరింపఁబడినది. మిగిలినవా రట్టివానినే ప్రయోగించినను లాక్షణికు లంగీకరింపలేదు. ఇదియుంగాక నన్నయ తిక్కన లుపయోగించినకొన్నిప్రయోగముల కనుగుణముగా నర్వాచీనలాక్షణికులు లక్షణములను రచియించిరి. ఇదంతయుఁ గవిత్రయమే యాంధ్రభాషకుఁ బ్రమాణమని వేనోళ్లఁ బొగడుచున్నది. వారిరచనలోఁ గొన్నిఛందోవ్యాకరణదోషము లున్నను, నవి గ్రాహ్యములే యనియు వానిని గాని యట్టివానిం గాని మరల నితరులు ప్రయోగించినను గ్రాహ్యములు గావనియుఁ దెలుపుటకు వారిప్రయోగములు రెండుమూఁ డుదాహరించెదను.

### కవిత్రయప్రయోగములు.

క. "భీమాసురవీరుల ముష్టాముష్టిరణచ్ఛటచ్ఛటాశబ్దం బు
ద్దామంబై తద్విపినమ,హామృగపక్షులకు నతిభయావహ మయ్యెన్." (ఆర. 3. 395.)

ఇందు ముష్టాముష్టి యనుప్రయోగము పాణినీయవిరుద్ధము. దానిం బట్టి ముష్టీముష్టి యనినయెడల యతిభంగ మగుచున్నది. ఈప్రయోగము ప్రామాదిక మగుటచే నితరుల కిది ప్రమాణము కాఁదగదు.

క. "సంతతగృహమేధిఫలం, బంతయుఁ బడయంగ నోపు ననుగుణభార్యా
వంతుం డగువాఁడు క్రియా, వంతుఁడు దాంతుండు పుత్రవంతుండు నగున్."(ఆది. 4. 83.)

ఇందు 'అనుగుణభార్యావంతుఁ' డనుచోటఁ గర్మధారయసమాసముకంటె మత్వర్థీయప్రత్యయము విధింపఁబడినది. ఇదియు నపాణినీయమే. కాని యిట్టి ప్రయోగములను వీరే కాక వీరితరువాతివారు గూడఁ బెక్కండ్రు ప్రయోగించిరి.

"మునీంద్రలోకవం,ద్యుమ్మని నప్పరాశరసుతున్."

'కమ్మని లతాంతములకు మ్మొనసి' అనుచోట్ల మకారము పర మగునపుడు ద్రుతమునకు మకారాదేశము విధింపఁబడినది. ఈరెండును ప్రాసస్థానములో నున్నవి. వంద్యున్ + ముని, లతాంతములకున్ + మొనసి, అనునపుడు 'ద్రుతంబుకు నసరళస్థిరంబులు పరము లగునపుడు లోపసంశ్లేషంబులు విభాష నగు' నని యా కార్యములు రాఁదగియున్నను, 'బిందుం ప్రవదంతి తం క్వచి త్కేచిత్' అనుసూత్రముచే నందలి నకారమున కనుస్వారము రాఁగా 'అనుస్వారస్య యయి పరసవర్ణః' అను పాణినీయసూత్రముచే సంస్కృతమందువలెనే యిచ్చటను గూడఁ

బరసవర్ణ మయినమకారాదేశము విధింపఁబడినట్లున్నది. ఇట్టివే కొన్ని ప్రయోగ వైచిత్ర్యము లిందుఁగలవు.

కఱకంఠుఁడు, ప్రాణగొడ్డము, జీవగఱ్ఱ మొదలగునవియిందుండుటచే ననింద్యగ్రామ్యములలోఁ బరిగణింపఁబడినను నిట్టివాని నితరు లుపయోగింపరాదు.

చ. "జగముల నెల్లెడన్ దురితసంతమసంబు జయింపఁ గోరి పా
ల్పుగఁ బరమేష్ఠి నిల్పిన వెలుంగు మహీసురు లట్టివారికిం
దగవు ఘటింప సత్పురుషసత్తములై చనుజీవనంబు లెం
తగుమతు లైన మాన్పఁగ వదంపడి యాయువు శ్రీయు నొల్లరే." (ఉద్యో. 1. 286.)

మ. "ధృతరాష్ట్రుండును బుత్రులున్ వనము గుంతీనందనుల్ సింహముల్
మతి నూహింప నసింహ మైనవనమున్ మర్దింతు రెందున్ వినా
వృతవృత్తంబులు గానిసింహములకున్ వేగంబ చేటొందుఁ గా
నతగం బొందుట కార్య మీయుభయము న్సంతుష్టిమై నున్కికిన్." (ఉద్యో. 1. 358.)

ఇందు మొదటిపద్యములోనినాల్గవపాదమునందు - గకారప్రాసమున కనుగుణముగా 'ఎంతగుమతు' లని ప్రయోగింపఁబడినది. 'న వికృతిశబ్దా త్పరత స్సంస్కృతికానాం భవంతి గసడదవాః' అనుసూత్రమునకు వ్యతిరిక్తముగానున్న యీప్రయోగమునుజూచి యితరులు తెలుఁగులమీఁదిసాంస్కృతికపరుషములకు గసడదవ లుపయోగింపరాదు.

రెండవపద్యమునాలవపాదంబున—'త' కారప్రాసమున కనుగుణముగా 'కాన తగన్' అని ప్రయోగింపఁబడినది. 'కానన్' అనునది హేత్వర్థకము ద్రుతప్రకృతికము నగునవ్యయముగా సర్వత్ర కనఁబడుచున్నది. 'ఇటీవలఁ గొందఱీయవ్యయము కళ యని తలంచుచున్నారు గాని యది యనాకరము. కొన్ని వ్రాఁతప్రతులయం దిది కళగాఁ గానవచ్చుచున్నమాట సత్యమే కాని యదియే దీనిని గళ గాపింపఁ బ్రమాణముగాఁ జాలదు. ఇది కళ యగునా కాదా యనుటకుఁ బ్రాసస్థానముల నిట్టిప్రయోగము లింకను గనుపట్టుటయే యాధారము. కాని యింతవఱకుఁ బ్రామాణికప్రయోగము గా నిది యొక్కటియే కనఁబడుచున్నది. శ్రమ పడినచో నిట్టి వేవైన నొకటి రెండు దొరకునేమో. కాని యెట్లయినఁ 'గానన్' అనునది ద్రుతప్రకృతికము గాని కళ గాదని చాలమందియాశయము. మఱియుఁ దిక్కన్న క, గలకు—త, దలకుఁ బ్రాసము విధించినాఁ డని కొందఱయాశయము. కానఁ బ్రామాదికప్రయోగములలో నొకటియగుదీని నితరు లిట్లు ప్రయోగింపఁదగదు. కాని దీని నాధారముగాఁగొని యిప్పటిముద్రణములలో 'కాన' యని కళగా ముద్రించుచున్నారు. ఇది చింత్యము. ఇట్లే యందందు ద్రుతద్విత్వసంధులును, అఖండయతులును, మున్నగుఛందోవ్యాకరణదోషములు గానవచ్చును.

**ఏమున్న నేమి? కవిత్రయ ప్రయోగములకు లోకములోఁ బూజ్యతయే కలదు. వీరు ప్రయోగించినా రనుకారణముంబట్టి యట్టిరెండుమూఁడలాక్షణిక ప్రయోగములఁ బ్రయోగింప సాహసింపక వారిసలక్షప్రయోగసహస్రములనే సుకవులు గ్రహించి తమతమకావ్యములఁ బొందుపఱచి రనుట లోకవిదితమే.**

**మఱియు,**

క. "సుందరి! మాయిద్దఱలోఁ,నం దెవ్వరి వలతు సెప్పుమా..."

క. "కర్ణుండు రేఁచి పెట్టఁగ, దుర్ణయపరు లైనశకునిదుశ్శాసనులు ..."

గీ. "వాయపురజ్జులాఁడధిప! వారలచందము ..."

గీ. "రాజసూయంబుపట్టిప రాజవర్య, వైష్ణవం బనుయాగంబు..."

క. "అనయము దుస్తర మగుచ, వ్యాసవాసము నిస్తరించి ద్వాపశవర్షంబునకడపట. ..."

క. "మాతలి పాణిగ్రహణం, బాతనిఁ జేయించి...."

క. "గలినీవె నాకు మత్సం, తతికిని నీయల్లుఁగుఱ్ఱతనముఁడు పుట్టెక్
మృతుఁడై క్రూరసం డగుగురు, సుతుని యిషీకాస్త్రనిహ్నఁ జూఁడిరకతనన్." అశ్వ. 3. 169.

క. "సవతాలికిఁ బతివలదిన..."

గీ. "గొంతికోడండ్రు రెల్లను గురువరేణ్య!..."

క. "ఆయాసము సాత్త్రింపని, మీరొయిడలు ..."

శా. "...పీడం బెట్టెడు సౌకుమార్యవతి డప్పిం గూలెఁ బాంచాలివా
ర్ధో డైవచ్చిరి వారు లేక యిట మీతో. ..."

**ఇత్యాదులు ప్రౌఢప్రయోగంబులు వ్యాకరణవిశేషంబులు నిం దనేకంబులు చూపబడెడిని. ఇఁక నిమ్మహాకావ్యమున సామెతలు జాతీయపదములు నమితముగాఁ గల వని వేఱె యుదాహరింపనేల.**

### రసములు, అలంకారములు.

**ఈభారతసుధారసాబ్ధిలో రసమణులు నలంకారమౌక్తికంబులు నపారముగా లభించు నని వేఱె చెప్పవలయునా? ఇందలి ప్రధానవిషయమును దదనుగుణము లగునుపాఖ్యానములును సర్వరసాస్పదములై వివిధాలంకారాలంకృతంబులై విద్వజ్జనహృదయము నలంకరించుచుండుట లోకానుభవసిద్ధమే. అయిన నందందలివికొన్ని యుదాహరించెదను.**

ఉ. "అంగజరాజ్యలక్ష్మి పొడ వైనదియొక్కొ యనంగ నొప్పుచి
త్రాంగదయందుఁ బార్థుఁడు మహాప్రణయప్రవణాంతరంగుఁడై

యంగజభోగసంగమున నమ్మణిపూరుపురిన్ సమస్తలో
కాంగణరంగసంగతవిహారయశోఽంగదుఁ డుండె లీలతోన్. (ఆది. 8. 146.)

ఇందు త్ప్రేక్షానుప్రాణిత స్వభావోక్తిచే సంభోగశృంగారము వర్ణింపఁబడినది.

మ. "ఘనపక్షాహతులం బ్రకాండపరిఘాఘాతంబులం దీవ్రశా
తనఖోచ్ఛేదములం బ్రదీప్తశరవేధక్రీడలం గ్రూరచం
చునిపాతంబులఁ బ్రౌఢకుంతముఖవిస్ఫోటంబులం దక్షిగేం
ద్రనిశాటేంద్రులపోరు సాధనసమత్వస్ఫూర్తి నొప్పెం గడున్. (అర. 6. 347.)

ఇం దారభటివృత్తిచే ద్వంద్వయుద్ధము వీరరసోద్రేకముగా వర్ణింపఁబడినది.

చ. "అడవికి నేగునాఁడు మము నంపఁగ 'నెంతయు దవ్వు వచ్చిన
ప్పుడు దనమోము దైన్యమునఁ బొందెడునశ్రులు చూచి మాచి య
ట్లొడఁ బడి డించి పోవలసె నుమ్మలికమ్మున గొంతి యింతకున్
బడు గయి పాలలోఁ బడినబల్లివిధంబున నుండు కుందునే!" (ఉ. 3. 135.)

ఇం దుపమానాలంకారంబుచేఁ బోషింపఁబడినకరుణరస మెంతయు జాలి పుట్టించుచున్నది.

ఉ. "నీవును జూచి తట్టిసభ నేని వినంబడ దేయుగంబులన్
భూవలయంబులో నది యపూర్వము సర్వమనోజ్ఞ మిష్టభో
గావహ మేక్రియం బడసె నయ్య మహాత్ముఁడు దాన నేమి సం
భావితభాగ్యుఁ డయ్యెను బ్రభాకరతేజుఁడు ధర్మజుం డిలన్ (స. 2. 95.)

ఇందు విస్మయస్థాయి యగునద్భుతరసము వర్ణింపఁబనినది.

గీ. "ఆడుఁ జందంబు పురుషసమాకృతియును, గలిగి యున్నది యొప్పు నూష్మలతసొంపు
వికృతవేషావృతంబు లై వెలయ కితఁడు, నివురు గవిసిన మెఱయని నిప్పువోలె. (వి. 4. 35.)

ఇందుఁ బరవికృతవేషజనితహాస్యరస ముపమాలంకారమునఁ బోషింపఁబడినది.

మ. "కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ చూచుచుండన్ మదో
ద్ధురుఁడై ద్రౌపది నిట్లు సేసినఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘ ని
ర్ఝర ముర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్ (స. 2. 233.)

ఇందు రౌద్రరసము వర్ణింపఁబడినది.

మ. "నరసింహుం డసురేంద్రు వ్రచ్చుకరణిన్ రౌద్రం బుదగ్రంబుగా
నుర మత్యుగ్రతఁ జీరి క్రమ్మురుధిర మ్ముల్లాసియై దోయిట

న్వెర వారం గొని త్రావు మెచ్చుఁ జవికి న్మేనుఁ బొగంబుఁ భయం
కరరేఖం బొరయంగఁ జల్లికొను నక్కారవ్యుఁ జూచుం బొరిన్." (కర్ణ. 3. 214.)

**ఇందు భీభత్సరస మభివర్ణింపఁబడెను.**

ఆ. "నిర్దయాత్ముఁ బాపనిరతు దుశ్శాసనుఁ, బనుచు టెఱిఁగి కృష్ణ పంకజాక్షి
కడు భయంబు నంది గాంధారియొద్దకు, నరిగెఁ గడు నడింకి యతిరయమున." (స. 2. 213.)

**ఇందు భయానకరసము తెలుపఁబడినది.**

శా. "ద్యూతవ్యాజమునన్ సభాంగణములో దుర్యోధనుం డట్లు దు
ర్నీతిం గూరి యొనర్చినట్టియఘముల్ నిష్కంపధైర్యోన్నతిన్
జేతస్సాక్షి యితండ వైననీ కొకనికిం జెల్లెన్ సహింపంగ వి
ఖ్యాతక్షాంతులు లేర ధార్మికులు నిక్కం బిట్టిరే యెవ్వరున్." (అర. 4. 157.)

**ఇందు శాంతరసము వర్ణింపఁబడినది.**

**అర్థాంతరన్యాసాలంకారము:—**

చ. "అతులపరాక్రమార్జితము లైనధనంబులచేఁ ర్మిఁ జేసి యు
న్నత మగుచున్నపాండునరనాథతనూజులలక్ష్మి నాకస
మ్మత మయి నూ వెలింగె విను మాతులమానధనాఢ్యుఁ డైనభూ
పతి సహియింప నోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్." (సభా. 2. 98.)

**భ్రాంతిమదలంకారము:—**

చ. "తమము నడంచుచున్ వెలుఁగుతత్పురగోపురశాలకుంభకుం
భముల విచిత్రసన్మణిగభస్తివితానములన్ విచిత్రవ
ర్ణము లగునాత్మవాహముల నమ్మక పల్కులుఁ జూచి యన్యవా
హము లని సంశయప్రణిహితాత్ముఁ డగున్ హరిదశ్వుఁ డెప్పుడున్." (ఆది. 8. 77.)

**రూపకాలంకారము:—**

ఉ. "చేతులతీఁట వోనిటు లశేషబలంబుల నుగ్గు సేసి మాం
సాతతపంకయై బహువిధాయుధమీనము లొప్పఁ జామర
వ్రాతము ఫేనభంగిగ నిరంతరవీరశిరస్సరోరుహ
స్ఫీతవిభూతిఁ బొల్చునది సేసె రణస్థలియందు నెత్తుటన్." (విరా. 5. 157.)

**కావ్యలింగాలంకారము:—**

చ. "ఇది యొకఁ డేల నీవు మది నెయ్యది గోరినఁ జేయువాఁడ నాఁ
డదయత నూతనూతి సభ నాడినమాటకుఁ జాల నొచ్చి మా

హృదయము లెల్ల నీవలన నెంతయుఁ బక్షము సేయు నక్కటా!
యదియును గాక మీపడినయాపద లెవ్వరి నొవ్వఁ జేయవే?" (ఉద్యో. 1. 114.)

సనిదర్శనార్థాపత్త్యలంకారము:—

చ. "అనుటయుఁ జిన్ననవ్వు నగి యంబుజనాభుఁడు నల్కు నెన్నఁడుం
విననివి భీముపాలఁ గడు వింతలు వింటిమి మాట లగ్గిచ
ల్ల నగుట భూరిభూధరము లాఘవ మొందుట గాదె యివ్విధం
బున నితఁ డిట్టు మార్దవముఁ బొందుట యిం కిటఁ జెప్ప నేటికిన్. (ఉ. 3. 52.)

ఇట్లే యీగ్రంథ మామూలాగ్రముగా సర్వరసాలంకారాలంకృతం బయి వివిధవర్ణనవిభూషితం బై చిరకాలంబుగా సకలజనమనోరంజకం బగుచుండ స్థాలీపులాకన్యాయంబుగ దీని నిట్టిది యని విమర్శించి చెప్పుట కాగడాతో సూర్యునిఁ జూపించుట వంటిదే కాని వేఱు గాదు. ఈభారతమే యాంధ్రభాష యని ప్రసిద్ధి చెందుచుండఁ గవిత్రయమే యాంధ్రవాఙ్మయమున కాధార మని నుతి కెక్కుచుండ నిఁక నీమహాపురాణమందలిగుణముల గణింప నెవరితరము? అయినను బ్రకృతకాలస్థితిని బట్టి గ్రంథముద్రణావసరంబునఁ దక్కవిని, గ్రంథమందలిగుణదోషములను, ససంగ్రహముగఁ దెల్పునట్టిపీఠికను గూడ ముద్రించుట యాచారమును జనరంజకంబు నగుటచే నీచిన్నపీఠిక వ్రాయవలసివచ్చినది గాని యాంధ్రమహాభారత మిట్టిది యని క్రొత్తగా లోకమునకుఁ దెల్పుటకుఁగాదు. పెక్కండ్రు పెక్కువిధములు గా ముద్రించుచున్న యీమహాగ్రంథమందుఁ బెక్కుచోట్లఁ బాఠభేదము లందందుఁ గనుపట్టుచున్నవి. ప్రాచీనకాలమున ముద్రితము లగు ప్రతులలోని పాఠములకు నిప్పుడు ముద్రింపఁబడువానిలోని పాఠములకు నంతర మందందుఁ జూపట్టెడిని. ఈపాఠభేదము లన్నియుఁ గొంచె మించుమించుగా సమానార్థకములే యైనను మహాజనపరంపరాయత్తములై వచ్చుపాఠములతో నిప్పటి ముద్రితప్రతులలోని పాఠము లందందుఁ గొన్ని వివదించుచున్నవి. కొన్ని వేఱుపడుచున్నవి. మఱి కొన్ని శ్రవణహృదయరంజకములు గాకున్నవి. ఇట్టిపాఠాంతరములకుఁ గొన్ని తాటాకులప్రతు లాధారము లగుచున్నమాట సత్యమే కాని చిరకాలంబుగ విద్వజ్జన మామోదించిన పాఠములయందలిరుచి యీనూతనపాఠాంతరములకు సంభవింపదు. చూడుఁడు.—

" ... ... ... రాజసూ
యావభృథంబునందు శుచియై పెనుపొందినవేణి పట్టి యీ
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చెఁ గులాంగన లిట్టు లోర్తురే."

" ... ... కౌరవరాజ! యొకండ నేఁ బృథా
పుత్త్రులలోనఁ జిన్న నినుఁ బోరికిఁ బిల్వఁగఁ బోక పాడియే."

అని పై రెండుపాఠములును బ్రసిద్ధములై యుండఁగా, నిందును మఱికొన్నిటి యందును గూడ

"కులాంగన ని ట్లొనర్తురె !"
"నినుఁ బోరికిఁ బిల్వఁగ మాని నాఁగ"

అనెడిపాఠములు ప్రధానములుగా ముద్రింపఁ బడినవి. వీనియందు విశేషించి యర్థభేదము గనరా దని చెప్పవచ్చును గాని పూర్వపాఠములు వినినవారి చెవులకీపాఠము లంతగా సుఖ మీయఁ జాలవు. ఇట్లే యీగ్రంథమునఁ గూడఁ గొన్ని ప్రధానపాఠములు పాఠాంతరములలోను గొన్ని పాఠాంతరములు ప్రధానపాఠములలోను ముద్రింపఁ బడినవి. మొత్తముమీఁద నెల్లపాఠాంతరములు చూపఁబడినచో నంత చింత లేదు గాని, కొన్ని సుప్రసిద్ధపాఠములను స్మరింపక పోవుట మాత్రము విచారకరము గాక పోదు. మఱియు;—

(1) ఈదేశమండలి కొన్ని వ్రాఁతప్రతులయందును విశేషించి దక్షిణదేశమండలి వ్రాఁతప్రతులయందును 'ఏగు' ధాతువులో నర్ధానుస్వారమో లేక పూర్ణానుస్వారమో కనఁబడుచున్నమాట సత్యమే కాని కొంతకాలముగా నర్వాచీనులు దానిని నిర్బిందువుగానే వ్యవహరించుచున్నారు. అట్లే ముద్రించుచున్నారు. (2) చేదర్థకమయిన 'ఏని' అనునవ్యయము సముచ్చయసంయోగంబున 'ఏనియుఁ' 'ఏనిఁ' అనిభారతములోఁ గనవచ్చుచున్నది కాని యది ప్రత్యేకించి కళగాని ద్రుతప్రకృతికము గాదని చాలమంది యాశయము. (3) హేత్వర్థకమయిన 'కానఁ' అనునది ద్రుతప్రకృతికముగా బహుప్రాచీనార్వాచీనగ్రంథములయందుఁ గనఁబడుచున్నది. ఇట్లుండఁగా మొదటిదానిని సబిందుకముగాను రెండవదానిని ద్రుతప్రకృతికముగాను, మూఁడవదానిని కళగాను దీనిలో ముద్రించుట యెంతవఱకుఁ దగునో విద్వల్లోకమే యెఱుంగఁ గలదు. సందిగ్ధములుగా నున్నయిట్టిప్రయోగములు కొన్ని యిందు ముద్రింపఁబడినను మొత్తముమీఁద వ్యయప్రయాసముల కోర్చి పెక్కువ్రాఁతప్రతులఁ బరిశీలించి పరిశుద్ధముగా నిమ్మహాకావ్యమును ముద్రించుట యెంతయుఁ బ్రశంసనీయము.

కావ్య మెంత మంచిది యైనను ముద్రణము సరి యయినదియుఁ బరిశుద్ధమయినదియుఁ గానిచో నక్కావ్యము చదువుట కింపుగా నుండదు. పూర్వకాలమున విద్యయందలిశ్రద్ధచేఁ బరగ్రామముల కేగి వ్రాసికొని గ్రంథముల సేకరించి చదివికొని యానందించెడివారు. ఇప్పు డన్ననో చేతికి లభించినపుస్తకము నైన నాదరముతోఁ జూచుట యరుదు. అట్టియీకాలమున్న భాషయం దాదరము గలుగుట కనుగుణముగాఁ బ్రాచీనకావ్యములను జక్కఁగా ముద్రించుట భాషాభివృద్ధికిఁ గొంత తోడ్పడుచున్నది. అట్టిముద్రణమును మొదల నారంభించి యింత

వఱకును భాషాసేవ సేయుచున్న శ్రీవావిళ్లవారికుటుంబమునకు భగవంతుఁడాయురారోగ్యముల నిచ్చుఁగాక!

నానేర్చినకొలఁది నేదో యొకవిధముగా వ్రాసినయీపీఠికను జిత్తగించిన విద్యావంతు లిందలిగుణములను గ్రహించి దోషములను మన్నింతురు గాక!

ఇట్లు
విద్వజ్జనవిధేయుఁడు,
మల్లాది. సూర్యనారాయణశాస్త్రి.